RNI No.: TELTEL/2023/90269

# తెలంగాణ షాన్

ప్రతి పదం ప్రజల పక్షం

తెలుగు దిన పత్రిక

# TELANGANA SHAAN

Telugu Daily

విలేకరులు కావలెను

తెలంగాణ షాన్

తెలుగు దినపత్రిక

నందు రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు
నియోజకవర్గ ఇన్చార్జ్‌లు
మండలాల వారిగా విలేకరులు కావలెను

ఆసక్తి గల యువతీ యువకులు

సంప్రదించవలసిన మొబైల్
నెంబర్: 99637 08331

| Malkajgiri | Volume: 4 | Issue: 25 | Tuesday, June 16, 2026 | Editor: RAMANCHARLA SRIKANTH | Pages: 4 | Rs. 4/- |
|---|---|---|---|---|---|---|
| మల్కాజ్గిరి | సంపుటి: 4 | సంచిక: 25 | మంగళవారం, జూన్ 16, 2026 | ఎడిటర్: రామన్‌చర్ల శ్రీకాంత్ | పేజీలు : 4 | వెల : రూ.4 /- |

### యూఎస్-ఇరాన్ శాంతి ఒప్పందం..

# దూసుకుపోయిన సెన్సెక్స్

- అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందంపై సానుకూల సంకేతాలు
- భారత స్టాక్ మార్కెట్లలో భారీ లాభాలు, 736 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్
- కుప్పకూలిన ముడి చమురు ధరలు, భారత్‌కు పెద్ద ఊరట
- కాల్పుల విరమణ, హర్మూజ్ జలసంధి
- తెరిచేందుకు ఇరు దేశాల అంగీకారం
- శుక్రవారం నాడు స్విట్జర్లాండ్‌లో ఒప్పందంపై అధికారిక సంతకాలు...



**న్యూఢిల్లీ,జూన్,15:** అమెరికా, ఇరాన్ దేశాల మధ్య శాంతి ఒప్పందం కుదిరిందన్న వార్తల నేపథ్యంలో సోమవారం భారత స్టాక్ మార్కెట్లు భారీ లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు వెలువడటంతో మదుపరులు కొనుగోళ్ల వైపు మొగ్గు చూపారు. ఫలితంగా బీఎస్ఈ సెన్సెక్స్ 736 పాయింట్లు (0.97శాతం) మేర ఎగబాకగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ సైతం గణనీయమైన లాభాలను నమోదు చేసింది. గత నాలుగు నెలలుగా కొనసాగుతున్న అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు సద్దుమణిగే సూచనలు కనిపిస్తుండటంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు ఒక్కసారిగా తగ్గుముఖం పట్టాయి. చమురు ర వాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని తిరిగి ప్రారంభిం చేందుకు, ఇరాన్ నౌకాశ్రయాలపై ఉన్న ఆంక్షలను ఎత్తివేసేందుకు ఇరు దేశాల మధ్య ప్రాథమిక అవగాహన కుదిరినట్లు వార్తలు వచ్చాయి. ఇరాన్‌తో ఒప్పందం ఖరారైందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సామాజిక మాధ్యమాల వేదికగా వెల్లడించారు.

ఇంధన దిగుమతులపై అధికంగా ఆధారపడే భారత్ వంటి దేశాలకు ఈపరిణామం పెద్ద ఊరటనిచ్చే అంశం. చమురు ధరలు తగ్గుదల వల్ల ద్రవ్యోల్బణం అదుపులోకి వచ్చి, తద్వారా దేశ ఆర్థిక వృద్ధికి దోహదపడు తుందని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ఈ శాంతి ఒప్పందంపై స్విట్జర్లాండ్‌లో శుక్రవారం అధికారికంగాసం తకాలు జరగనున్నాయి. అయితే, ఇరాన్‌అణు కార్యక్రమం వంటి కీలక అంశాలపై రానున్న 60 రోజుల్లో తదుపరి చర్చలు కొనసాగనున్నాయి. కాగా, ఈఒప్పందంలోని కొన్ని నిబంధనలను ఇజ్రాయెల్ వ్యతిరేకించడం గమనా ర్హం. ఏదేమైనప్పటికీ, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గడం ప్రపంచ ఆర్థిక విపణికి సానుకూల పరిణామంగా మారింది.

### పంటకొనుగోళ్లపై

# కేంద్రం ద్వంద్వ వైఖరి

### మంత్రి తుమ్మల ఆగ్రహం



హైదరాబాద్, జూన్ 15: పంట కొనుగోలు చేసే విషయంలో కేంద్రం అవలంబిస్తున్న ద్వంద్వ వైఖరి తెలంగాణ రైతుల పాలిట శాపంగా మారిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా అన్ని పంటలు కొనుగోలు చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని, రాష్ట్ర రైతాంగం పట్ల కేంద్రం వివక్ష చూపడం సమంజసం కాదన్నారు. మోదీ ప్రభుత్వం తన బాధ్యత వదిలివేసి రాష్ట్రాలపై భారం మోపడం సరికాదని, మక్కలు కొనుగోలు చేయలేని పరిస్థితి ఉన్నప్పుడు మద్దతు ధరలు ఎందుకు ప్రకటించాలని నిలదీశారు. ఇవాళ హైదరాబాద్‌లోని మార్క్‌ఫెడ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పంటల కొనుగోలు చేస్తోందని తెలిపారు. ఇప్పటికే 15 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న, రెండు లక్షల మెట్రిక్ టన్నుల జొన్నలను ప్రభుత్వం కొనుగోలు చేసిందని చెప్పారు. రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి మార్క్‌ఫెడ్‌కు రూ. 4,800 కోట్ల అప్పులు ఉంటే, ఈ రెండు సంవత్సరాల్లో మరో రూ. 1,800 కోట్లు అప్పై.. ప్రస్తుతం రూ. 6 వేల కోట్ల అప్పులతో ఇబ్బందులు పడుతుందన్నారు.


పంటలను దేశంలోని వివిధ రాష్ట్రాలకు, ఇతర దేశాలకు ఎగుమతి చేసే వ్యవస్థ కేంద్రం చేతిలో ఉంటుందని, ఎంఎస్పీ (మీరా)కి పంటలు కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా తరలించు కోవచ్చని, ఈ క్రమంలో రాష్ట్రంపై వివక్షను పక్కన పెట్టి అన్ని పంటలు ఎంఎస్పీకి పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ధాన్యం నిల్వకు అవసరమైన గిడ్డంగులు కూడా కేంద్రం ఆధీనంలో ఉన్నాయని, రాష్ట్రంలో అత్య ధికంగా పంటల దిగుబడి జరుగుతుం డటంతో అందుకు అనుగుణంగా గోదాముల నిర్మాణాలు చేపట్టాలని కోరినా కేంద్రం స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

రైతులకు, మరోవైపు కొనుగోలు చేసిన ప్రభుత్వానికి నాణ్యత లేకుండా పోతుందన్నారు. రైతుల సమస్యలపై త్వరలో రాష్ట్ర మంత్రుల బృందం ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను కలవనున్నట్లు చెప్పారు.

పంట మార్పిడిపై పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నామని, రైతులు నష్టం లేని ఉద్యానవన పంటల వైపు మారాలని కోరారు. రాష్ట్రంలో ఇప్పటికే సుమారు మూడు లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని, రాబోయే రెండున్నర సంవత్సరాల్లో సుమారు ఆరు లక్షల ఎకరాల్లో సాగు చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.

### భారత అమ్ములపొదిలో మరో

# శక్తిమంతమైన అస్త్రం..



**చాందీపూర్,జూన్,15:** భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ మరో కీలక మైలురాయిని అధిగమించింది. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో అభి వృద్ధి చేసిన లాంగ్ రేంజ్ ల్యాండ్ అటాక్ క్రూయిజ్ క్షిపణిని సోమ వారం విజయవంతంగా పరీక్షించిం ది. ఒడిశా తీరంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం ద్వీపం నుంచి ఈ ఫ్లైట్-టెస్ట్ నిర్వహించారు. ఈ ప్ర యోగం నిర్దేశించుకున్న అన్ని లక్ష్యా లను పూర్తిగా చేరుకుందని రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. చాందీపూర్‌లోని ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ ట్రాకింగ్ వ్యవస్థ ద్వారా క్షిపణి గమనాన్ని పర్యవేక్షించినట్లు పేర్కొంది. ఈ విజయంతో సుదూర ల క్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ఛేదించే భారత సామర్థ్యం మరింత పెరిగినట్లయింది. రక్షణ కార్యదర్శి, డీఆర్‌డీఓ ఛైర్మన్ రాజేష్ కుమార్ సింగ్‌తో పాటు భారత నౌకాదళం, వాయుసేనకు చెందిన ఉన్నతాధికా రులు ఈ ప్రయోగాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు. క్షిపణిని వి జయవంతంగా

- లాంగ్ రేంజ్ క్రూయిజ్ క్షిపణి పరీక్ష సక్సెస్
- లాంగ్ రేంజ్ ల్యాండ్ అటాక్ క్రూయిజ్
- క్షిపణిని విజయవంతంగా పరీక్షించిన డీఆర్‌డీఓ
- ఒడిశాలోని అబ్దుల్ కలాం ద్వీపం నుంచి ఈ ప్రయోగం
- పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో క్షిపణి రూపకల్పన
- భారత సుదూర లక్ష్య ఛేదన సామర్థ్యం పెరిగిందని వెల్లడి
- డీఆర్‌డీఓ బృందాన్ని అభినందించిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్

పరీక్షించిన డీఆర్‌డీఓ బృందాన్ని, పరిశ్రమ భాగస్వాముల ను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు.

డీఆర్‌డీఓ ప్రయోగశాలలు, భారత పరిశ్రమ భాగస్వాములతో కలిసి ఈ క్షిపణిలోని అన్ని ఉపవ్యవస్థలను దేశీయంగానే అభివృద్ధి చేశాయి. బెంగళూరులోని ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ (ఏఈజు) నోడల్ లేబొరేటరీగా వ్యవహరించింది. ఈ విజయం 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యసాధనలోకీలక ముందడుగు అని నిపుణులు విశ్లేషిస్తున్నారు. రెండు రోజులక్రితమే డీఆర్‌డీఓ బాలిస్టిక్ మిస్సైల్ డిఫెన్స్,యాంటీ-షిప్ క్షిప ణులను వరుసగా పరీక్షించిన విషయం తెలిసిందే.

# హరీశ్‌రావు మాయలో పడ్డ కిషన్ రెడ్డి

### తెలంగాణ వచ్చినా సింగరేణిలో పరిస్థితి మారలేదు

### టిఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత సంచలన కామెంట్స్



మంచిర్యాల, జూన్ 15: మాజీ మంత్రి హరీశ్ రావుపై తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. హరీశ్ రూ.40లక్షల టన్నుల బొగ్గు స్కామ్ జరిగిందని అంటున్నారని, సరైన సమాచారం లేకుండానే కోల్ బెల్ట్‌లో తిరుగుతున్నారంటూ వ్యాఖ్యానించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కూడా హరీశ్ రావు మాయలో పడ్డారన్నారు. హరీశ్‌రావు లేఖ రాయగానే.. కిషన్‌రెడ్డి వెంటనే మరో లేఖ రాశారని తెలిపారు. తెలంగాణలో ఓపెన్ కాస్ట్‌లతో సమానంగా అండర్ గ్రౌండ్స్ ఓపెన్ చేయాలని డిమాండ్ చేశారు. తద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు పెరిగే అవకాశం ఉందన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత కూడా సింగరేణిలో పరిస్థితి మారలేదని కవిత వ్యాఖ్యానించారు. కార్మికులపై అత్యంత కర్కశంగా యాజమాన్యం వ్యవహరిస్తోందని.. ప్రశ్నించే కార్మికులను అధికారులు వేధిస్తున్నారని ఆరోపించారు. దీనంతటికీ కారణం ప్రభుత్వ అలసత్వమే అని మండిపడ్డారు. ఇటీవల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సింగరేణిలో పర్యటించారని.. కానీ కార్మికుల సమస్యలను తెలుసుకోలేదన్నారు. భట్టి విక్రమార్క పర్సంటేజ్‌లు తీసుకోవడం మానేయాలని.. ఆ తర్వాతే ప్రతిపక్షాలపై విమర్శలు చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ 2012లో బొగ్గు స్కామ్ చేసిందని టీఆర్ఎస్ చీఫ్ అన్నారు. అధికారంలోకి వచ్చిన బీజేపీ బొగ్గు బ్లాక్‌ల వేలం ప్రక్రియ చేపట్టిందని తెలిపారు. సింగరేణి కూడా వేలంలో పాల్గొనాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి జోక్యం చేసుకుని తెలంగాణ బ్లాక్‌లను సింగరేణికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల ఆదాయ పన్ను సమస్యను పరిష్కారం చేయాలన్నారు. బీజేపీ రాష్ట్రంలోకి వస్తేనే ఐటీ సమస్య పరిష్కారం చేస్తామని కిషన్ రెడ్డి అంటున్నారని.. ఆ పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశం లేదని, సింగరేణిలోనూ గెలిచే పరిస్థితి లేదని వ్యాఖ్యానించారు. 'పార్టీ పేరు అంశంలో మాకు క్లారిటీ ఉంది. కొత్త పార్టీపై ఫిర్యాదులు చేస్తున్నారంటే.. మేం బలంగా ఉన్నట్టే కదా' అంటూ కవిత పేర్కొన్నారు.

### నటుడు ప్రకాశ్ రాజ్‌పై తిరుపతి కోర్టులో

# క్రిమినల్ ఫిర్యాదు..

- రామాయణం, శ్రీరాముడిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపణ
- బీజేపీ నేత, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాశ్ రెడ్డి ఈ ఫిర్యాదు దాఖలు
- మతవిద్వేషాలను రెచ్చగొట్టే సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని వినతి
- కేరళ లిటరేచర్ ఫెస్టివల్‌లో చేసిన వ్యాఖ్యల ఆధారంగా ఈ ఫిర్యాదు...



**తిరుపతి,జూన్,15:**

ప్రముఖ సినీ నటుడు ప్రకాశ్ రాజ్‌పై తిరుపతి కోర్టులో సోమవారం క్రిమినల్ ఫిర్యాదు దాఖలైంది. రామాయణం, హిందూ దేవతలపై ఆయన చేసిన వ్యాఖ్యలు భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని ఆరోపిస్తూ బీజేపీ నేత, టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు జి. భానుప్ర కాశ్ రెడ్డి ఈ ఫిర్యాదు చేశారు. తిరుపతిలోని నాలుగో అదనపు జ్యుడిషి యల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో ఫిర్యాదు చేశారు. కేరళ లిటరేచర్ ఫెస్టివల్‌తో పాటు పలు బహిరంగ వేదికలపై ప్రకాశ్ రాజ్ చేసిన వ్యా ఖ్యలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమయ్యాయని ఫిర్యా దులో పేర్కొన్నారు. ఉత్తర భారతదేశం నుంచి వచ్చిన శ్రీరాముడు, లక్ష్మణుడు దక్షిణాదిపై (లంకగా పోలుస్తూ) దండయాత్ర చేశారని, ఇ ది ఆర్యుల-ద్రావిడుల విభజనను ప్రోత్సహించేలా ఉందని ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యానించినట్లు భానుప్రకాశ్ రెడ్డి ఆరోపించారు.

ఈ వ్యాఖ్యలు వాస్తవ విరుద్ధంగా ఉండటమే కాకుండా, ఉద్దేశపూర్వకంగా మతపరమైన విశ్వాసాలను కించపరిచేలా మరియు ప్రాంతీయ విద్వేషాల ను రెచ్చగొట్టేలా ఉన్నాయని ఫిర్యాదులో వివరించారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), 2023లోని సెక్షన్ 299, 196 కింద కేసునమోదు చేసి,ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సామాజిక మాధ్యమాల్లో ప్రకాశ్ రాజ్ మాట్లాడిన వీడియో ఏప్రిల్ 17న తన దృష్టికి వచ్చిందని భానుప్రకాశ్ రెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు.

# ఏపీ అభివృద్ధిలో సింగపూర్ భాగస్వామ్యం..

### ప్రధాని వాంగ్‌తో సీఎం చంద్రబాబు కీలక చర్చలు

- ఏపీ, సింగపూర్ మధ్య కొత్త భాగస్వామ్య అవకాశాలపై కీలక చర్చలు
- అమరావతి అభివృద్ధి, పురోగతిని ప్రధానికి వివరించిన చంద్రబాబు
- ఏపీలో పెట్టుబడులకు రావాలని సింగపూర్ కంపెనీలకు సీఎం ఆహ్వానం



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు సింగపూర్ పర్యటనలో భాగంగా ఆ దేశ ప్రధాని లారెన్స్ వాంగ్‌తో సోమవారం సమావేశమయ్యారు. ఈ భేటీలో ఆంధ్రప్రదేశ్, సింగపూర్ మధ్య కొత్త భాగస్వామ్య అవకాశాలపై ఫలవంతమైన చర్చలు జరిపినట్లు సీఎం చంద్రబాబు స్వయంగా సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. రాష్ట్ర అభివృద్ధికి కీలకమైన పలు రంగాల్లో సహకారం కోసం ఈ సమావేశం దోహదపడిందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా, సెమీకండక్టర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్వాంటం టెక్నాలజీస్, పరిశోధన-అభివృద్ధి వంటి అత్యాధునిక సాంకేతిక రంగాల్లో పరస్పర సహకారంపై ప్రధానంగా దృష్టి సారించినట్లు చంద్రబాబు తెలిపారు. వీటితో పాటు విశ్వవిద్యాలయాల మధ్య భాగస్వామ్యాలు, పట్టణ పాలన, నాయకత్వ అభివృద్ధి, లాజిస్టిక్స్, అధునాతన తయారీ వంటి అంశాలపై కూడా ఇరువురు నేతలు చర్చించుకున్నారు. ముఖ్యంగా, ప్రపంచస్థాయి మౌలిక వసతులు, సంస్థలతో అమరావతిని ఒక గ్లోబల్ బెంచ్‌మార్క్ రాజధాని నగరంగా తీర్చిదిద్దడంలో ఆంధ్రప్రదేశ్ సాధించిన పురోగతిని ప్రధాని వాంగ్‌కు చంద్రబాబు వివరించారు. అమరావతి విజన్, పురోగతిని ప్రధాని లారెన్స్ వాంగ్ ప్రశంసించారని, దాని భవిష్యత్ సామర్థ్యంపై పూర్తి విశ్వాసం వ్యక్తం చేశారని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ చర్చల్లో సాంకేతిక రంగాలతో పాటు ప్రకృతి వ్యవసాయం, ఆక్వాకల్చర్, ఆహార ఎగుమతులు, వైద్యారోగ్యం, స్వచ్ఛ ఇంధనం, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా వంటి రంగాల్లోనూ సహకారాన్ని అన్వేషించినట్లు చంద్రబాబు వివరించారు.

తెలంగాణ షాన్

## సంపాదకీయం

# కాకలు తీరిన కమ్యూనిస్టు యోధుడు నంబూద్రిపాద్...

నంబూద్రిపాద్ భారతీయ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన రాజకీయవేత్త, సిద్ధాంతకర్త. దేశ చరిత్ర లో గుర్తింపు పొందిన గొప్ప కమ్యూనిస్టు నాయకులు. భారత దేశంలో కాంగ్రెసేతర సంబంధిత కమ్యునిస్టు పార్టీ పక్షాన ఎన్నికైన తొలి ముఖ్యమంత్రిగా వినుతి కెక్కారు. మార్క్స్ వాద సూత్ర బద్ధుడు, విప్లవవాది, రచయిత, చరిత్రకారుడు. మార్క్స్ వాద కమ్యూనిస్టు పార్టీ ఆచరణ వాదిగా, క్రియాశీలక నేతగా, 14 యేళ్ళ పాటు జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఆయన తీసుకున్న చొరవ, ముందుచూపు గల నిర్ణయాలవలనే దేశంలో ఈనాడు జాతీయ స్థాయి సంకీర్ణ ప్రభుత్వ రాజకీయాలకు భూమిక అయిందన్న మాట వాస్తవం. నంబూద్రిపాద్ కేరళలో శ్రీకారం చుట్టిన మౌలికమైన భూ సంస్కరణలు, విద్యా సంస్కరణలను అనుకరించే ప్రయత్నాలు ఈ నాటికి ఇతర భారతీయ రాష్ట్రాలలో జరుగుతూనే ఉన్నాయి. సాంప్రదాయ బ్రాహ్మణ కుటుంబ నేపథ్యం కలిగి ఉన్నా, భూస్వామి కుటుంబంలో పుట్టినా శ్రామిక వర్గ లక్ష్యాలకు అంకితమై శ్రామిక విప్లవ ఉద్యమంలో అగ్ర నాయకుడిగా ఎదిగారు. ఇఎంఎస్ నంబూద్రిపాద్ బహుముఖ ప్రజ్ఞాశాలి, మార్క్సిస్టు రుషి, నిరంతర క్రియాశీలి. అవిశ్రాంత కలం యోధులు. సాహితీ విమర్శకులు. సాంస్కృతిక సైనికుడు. పాలనా చతురులు. సిద్ధాంత, ఆచరణల సంగమం. విప్లవ మేధావి. భావితరాలకు చెరగని ఆదర్శం. ఒకనాటి భారత రాష్ట్రపతి కెఆర్ నారాయణన్ అభివర్ణించినట్లుగా 20వ శతాబ్దపు మహోన్నత వ్యక్తి. ఇ.ఎం.ఎస్. అనే పేరుతో ప్రసిద్ధికెక్కిన ఏలాంకుళం మనక్కళ్ శంకరన్ నంబూద్రిపాద్, (1909 జూన్ 13 -- 1998 మార్చి 19) 1909 జూన్ 13 నాడు, ప్రస్తుత మలప్పురం జిల్లా పెరింతాళ్ మన్న తాలూకా ఏలాంకుళం గ్రామంలోని అగ్ర బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. తండ్రి పేరు పరమేశ్వరన్ నంబూద్రిపాద్. విద్యార్థి దశనుంచే శాస్త్రీయ భావాలు అలవరుచు కున్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ప్రముఖ పాత్ర వహించారు. చిన్న వయసులోనే ఆయన వి.టి.భట్టాద్రిపాద్ మొదలయిన పెద్దవారికి చేయూతగా, కేరళ నంబూద్రి కుటుంబాలలో పాతుకు పోయిన కులవివక్ష, సాంప్రదాయ వాదం ధోరణులకు వ్యతిరేకంగా పోరాడారు. చదువుకునే రోజుల్లో భారత జాతీయ కాంగ్రెస్ సహచర్యంతో స్వాతం త్ర్య సంగ్రామంలో తీవ్ర కృషి చేసారు. 1931 లో కాలేజీని వదిలి స్వాతంత్ర్య పోరాటంలో చేరారు. సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొని జైలు శిక్ష అనుభవించారు. అప్పటినుంచి ఆయన దేశ స్వాతంత్ర్యం కోసం సాగిన కాంగ్రెస్ ఉద్యమంలో ముఖ్యపాత్ర పోషించారు. కేరళలో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ స్థాపకుల్లో ఒకరుగా వున్నారు. 1934 లో ఆయన కాంగ్రెస్ పార్టీ సోషలిస్టు పార్టీ అఖిల భారత ఉమ్మడి కాలంలో కాంగ్రెస్ పార్టీకి, కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా మార్క్సిజంతో పరిచయం చేశారు. 1936 లో కేరళలో కమ్యూనిస్ట్ పార్టీ వ్యవస్థాపక బృందాన్ని ఏర్పాటు చేసిన ఐదుగురు సభ్యుల్లో ఆయన ఒకరు. నంబూద్రిపాద్ కేరళలో ఒక శక్తివంతమైన కమ్యూనిస్ట్ ఉద్యమం అభివృద్ధికి పునాదులు వేశారు. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం, భూస్వామ్య వ్యతిరేక పోరాటం. రెండు పోరాటాలకు ఆయన ప్రాతినిధ్యం వహించారు. కేరళను ఏకీకృత భాషా రాష్ట్రంగా ఏర్పర్చడానికి దారితీసిన ఐక్య కేరళ ముఖ్య ప్రతిపాదకులలో ఆయన ఒకరు. నంబూద్రిపాద్ మొట్టమొదట 1939 లో మద్రాసు ప్రొవిన్షియల్ శాసనసభకు ఎన్నికయ్యారు. కమ్యునిస్ట్ పార్టీని విస్తృత పరచడానికి ఆయన తన వాటగా వచ్చిన ఆస్తిని పార్టీకి విరాళంగా ఇచ్చాడు. అతను 1939–42 మరియు 1948–50 మధ్య అజ్ఞాతంలోకి వెళ్ళారు. ఆయన 1941 లో భారత కమ్యూనిస్టు పార్టీ సెంట్రల్ కమిటీకి ఎన్నికయ్యారు. డిసెంబరు, 1950 లో సిపిఐ పొలిట్ బ్యూరో సభ్యుడిగా, సెక్రటేరియట్ సభ్యునిగా పనిచేశారు. 1957 లో కేరళ రాష్ట్రం ఏర్పడిన తరువాత జరిగిన మొదటి ఎన్నికలలో కమ్యూనిస్ట్ పార్టీ మెజారిటీ సాధించడంతో 1957 ఏప్రిల్ 5 నాడు కేరళ రాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టి భారత దేశంలో మొట్టమొదటి కమ్యూనిస్ట్ ముఖ్యమంత్రిగా రికార్డులకెక్కారు. త్వరలోనే భూ సంస్కరణల చట్టాన్ని,విద్యా చట్టాన్ని తీసుకు వచ్చారు. వివాదాస్పదమైన పరిస్థితుల్లో 1959 లో కేంద్ర ప్రభుత్వం, భారత రాజ్యాంగం లోని 356 వ ప్రకరణం అనుసరించి రాష్ట్రపతి పాలన విధిస్తూ ఆ ప్రభుత్వాన్ని కూల్చి వేసింది. కేరళ శాసన సభకు 1960–64, తిరిగి 1970–77 కాలంలో ప్రతిపక్ష నాయకునిగా వ్యవహరించారు. 1967 లో రెండవసారి ముఖ్యమంత్రి కావడానికి నంబూద్రిపాద్ ముస్లిమ్ లీగ్ తో సహా 7 పార్టీల మద్దతు స్వీకరించారు. 1964 లో సిపిఐ (ఎం) ను స్థాపించిన తరువాత ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నుండి అందులో చేరారు. 1964 లో జరిగిన అఖిల భారత మహాసభలో పార్టీలో కేంద్ర కమిటీ మరియు పార్టీ పొలిట్ బ్యూరోకు ఎన్నికయ్యారు. ఆయన మరణం వరకు ఈ పదవిలో కొనసాగారు. 1977 లో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు) ప్రధాన కార్యదర్శిగా పదవిని చేబట్టి 1992 వరకు ఆ బాధ్యతలను నిర్వహించారు. అన్ని వామపక్ష, ప్రజాస్వామ్య, లౌకిక శక్తులను సమీకరించడంలో ఆయన నాయకత్వం అమూల్యమైనది. ఒక తెలివైన మార్క్సిస్ట్ సిద్ధాంతకర్తగా, భారతీయ సమాజంలో పరిస్థితులకు అనుగుణంగా మార్క్సిజం – లెనినిజం అన్వయించడంతో పాటు భారతీయ విప్లవం యొక్క వ్యూహానికి అనుగుణంగా సాగించాల్సిన, సాగించిన కృషిని ఆయన రచించారు. ఆయన వ్రాసిన పలు గ్రంథాలలో కేరళ చరిత్ర అనే పుస్తకం బహుళ ప్రాచుర్యం పొందింది. భూమి సంబంధాలు, కేరళ, సమాజం, రాజకీయాలు, మార్క్సిస్టు తత్వశాస్త్రం, సాహిత్యం మరియు చరిత్రలపై ఆయన వ్రాసిన రచనలతో ఆయన్ను దేశంలోనే గాక ప్రపంచంలోనే అత్యంత ప్రభావవంతమైన కమ్యూనిస్టు ఆలోచనా పరులలో ఒకరిగా గుర్తించ బడ్డాయి. విశిష్ట మార్క్సిస్ట్ సూత్రవేత్తగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా, ఆయన ముందు చూపుకు నిజాయితీ నిబద్ధతలకు కేరళ సాధించిన అభివృద్ధే తార్కాణం. ప్రజల యోజన ద్వారా కేరళలో అధికార, వనరుల వికేంద్రీకరణకు, అక్షరాస్యతా ఉద్యమానికి కృషి చేసారు. ఆంగ్ల, మలయాళ భాషల్లో అనేక పుస్తకాలు రచించిన నంబూద్రిపాద్ పత్రికా విలేఖరిగా కూడా సుపరిచితుడే.

# జర్మన్ భాషా ప్రావీణ్యంతో అంతర్జాతీయ ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి: మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి


**హైదరాబాద్ :** జర్మన్ భాష నేర్చుకోవడంలో క్రమశిక్షణ, నిరంతర సాధనే విజయానికి మార్గమని రాష్ట్ర మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. విదేశీ భాషల్లో ప్రావీణ్యం సాధించడం ద్వారా యువత అంతర్జాతీయ స్థాయిలో లభించే ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవచ్చని ఆయన అన్నారు. హైదరాబాద్లోని టామ్కామ్ (టిఓఎంకామ్) కార్యాలయంలో జర్మన్ భాషా శిక్షణ పొందుతున్న విద్యార్థులు, అధ్యాపకులతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్మనీలో ఉద్యోగ అవకాశాలను లక్ష్యంగా పెట్టుకున్న యువత కోసం టామ్కామ్ ఆధ్వర్యంలో జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నర్సింగ్, ఇంజినీరింగ్ తదితర రంగాల్లో జర్మనీలో మంచి వేతనాలతో కూడిన ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. కొత్త భాషను నేర్చుకుని జర్మనీ వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో ఉద్యోగాలు సాధించడం యువతకు గొప్ప అవకాశమని అన్నారు. ఇటీవల మందమర్రిలో ప్రారంభించిన జర్మన్ భాషా శిక్షణ తరగతులకు విశేష స్పందన లభించిందని తెలిపారు. మందమర్రి కేంద్రంలో ఇప్పటికే సుమారు 200 మంది యువత జర్మన్ భాషా కోర్సులో చేరినట్లు వెల్లడించారు. విద్యార్థుల హాజరును నిరంతరం పర్యవేక్షిస్తూ శిక్షణ నాణ్యతను మరింత మెరుగుపరుస్తున్నామని చెప్పారు. విదేశీ ఉద్యోగాలను పొందడంలో భాషా ప్రావీణ్యమే ప్రధాన అడ్డంకిగా మారుతోందని, దానిని అధిగమించేందుకు విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు ఒక్క తరగతిని కూడా మిస్ కాకుండా క్రమం తప్పకుండా హాజరై భాషపై పూర్తి పట్టు సాధించాలని సూచించారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో శిక్షణ పొందితే ఉన్నత స్థాయి భాషా నైపుణ్యాలను సులభంగా సాధించగలరని పేర్కొన్నారు. ఏ భాషనైనా నేర్చుకోవాలంటే నిరంతర అభ్యాసమే విజయానికి మూలమని మంత్రి స్పష్టం చేశారు. ఇటువంటి భాషా శిక్షణ కార్యక్రమాలు యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పించడంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో విజయవంతమైన కెరీర్ నిర్మాణానికి దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఆగని నీటి యుద్ధం

**హైదరాబాద్, జూన్ 15 :** నీళ్లు, నిధులు, నియామకాలు.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షకు ఊపిరిలూదిన ప్రాథమిక నినాదాం. కానీ, ఆ నినాదాలు నినాదాలుగానే మిగిలిపోతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పుష్కర కాలం (12 ఏళ్లు) గడిచినా ఉమ్మడి ప్రాజెక్టుల నీటి వినియోగంలో నదీ జలాల వాటాల పంపకంలో ఆంధ్రప్రదేశ్ ఇప్పటికీ తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తూనే ఉంది. కృష్ణా జలాల్లో ఇరు రాష్ట్రాలకు వాటాల కేటాయింపులో అప్పటి ప్రభుత్వం సరిగ్గా వ్యవహరించకపోవడంతో నష్టపోయామని మేధావులు, ఇంజినీర్లు, తెలంగాణ వాదులు అంటున్నారుకనీసం నిర్ణయించిన వాటాను సైతం ఉపయోగించుకో కుండా.. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌కు వత్తా సు పలుకుతుండటాన్ని వారు ఎత్తిచూపుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత పరిస్థితి ఇంకా దిగజారిందని, పక్క రాష్ట్రానికి గేట్లు బార్లా తెరవ డంతో.. వాటాను మించి ఉపయోగించుకుంటుందని తెలంగాణ ఇంజినీర్లు చెబు తున్నారు. స్వరాష్ట్రంలోనూ జరుగుతున్న ఏపీ జల దోపిడీని పాలకులు చూసీ చూడనట్టుగా వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన మొదట్లో ఇరు రాష్ట్రాల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు కృష్ణా జలాలను 66:34 నిష్పత్తిలో వినియోగించుకోవాలి. అయితే ఈ ఒప్పందమే సరికాదని అందరూ అం టుంటే.. అసలు చేసుకున్న అగ్రిమెంట్ ప్రకారమైనా కృష్ణా జలాలను వినియోగించుకున్నారా అంటే.. అదీ లేదని అధికారిక గణాంకాలను చూస్తే అర్థం అవుతుంది. గడిచిన 12 ఏళ్లలో కృష్ణా జలాల్లో ఆంధ్రప్రదేశ్ వినియోగించిన మొత్తం శాతం 826.64 కాగా.. ప్రతి సంవత్సరం సగటున 68.88 శాతం (ఏపీకి 66 శాతం వాటా) తరలిస్తోంది. అంటే సగటున ప్రతి సంవత్సరం సుమారు 3 శాతం నీటిని అదనంగా వాడుకుంటున్నట్టుగా చెప్పవచ్చు. తెలంగా ణ విషయానికి వచ్చేసరికి.. 12 ఏళ్లలో 374.36 శాతం.. అంటే ఏటా సగటున 31.19 శాతం జలాలను మాత్రమే వాడుకున్నది. ఈ లెక్కన ప్రతి సంవత్సరం సగటున సుమారు 3 శాతం వరకు (తెలంగాణ వాటా 34 శాతం) కృష్ణా జలాలను తెలంగాణ నష్టపోయిందనే చెప్పవచ్చు. అంటే ఒక సంవత్సరంలో ఎంతమేర తెలంగాణ కృష్ణా నదీ జలాలను వాడుకోవాలో గడిచిన 12 ఏండ్ల లో అంతమేర నష్టపోయినట్టే. ఇది వందల టీఎంసీలలో ఉంటుంది. నిజానికి ప్రత్యేక తెలంగాణ వచ్చిందే.. నీళ్లు, నిధులు, నియామకాలలో దోపిడీ జరుతుందనే. అందుకే దశాబ్దాలుగా పోరాటం చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని తెచ్చుకున్నారు. కానీ,ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడినప్పటికీ.. ఇంకా జల దోపిడీ కొనసాగుతూనే ఉందని మేధావులు, ఇంజనీర్లు, తెలంగాణీయులు భగ్గుమంటున్నారు. రాష్ట్రం ఏర్పడిన సంవత్సరం (2014–15)లో తెలంగాణ తనకు కేటాయించిన వాటా (34 శాతం)లో కేవలం 30 శాతం మాత్రమే ఉపయోగించుకుంది. కానీ, ఏపీ తనకు కేటాయించిన (66 శాతం) వాటాను మించి 69.92 శాతం జలాలను వినయోగించుకుంది. 2015–17 వరకు ఒకటి.. అర శాతం వరకు తగ్గింది. 2023–24లో ఎన్నికల ప్రభావం కారణంగా 34 శాతానికి మించి చరిత్రలో మొదటిసారిగా తెలంగాణ 36.34 శాతం జలాలను వియోగించుకోవడం ఇక రికార్డు. ఆ తరువాత కూడా కేటాయింపుల దరిదాపుల్లోకి కూడా తెలంగాణ రాలేదు. పుష్కర కాలంలో కేవలం ఒకే ఒకసారి వాటాను మించి కృష్ణా నదీ జలాలను తెలంగాణ ఉపయోగించుకుంది. ఇక మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపొంది.. పాలనా పగ్గాలు చేపట్టిన తరువాత.. పరిస్థితి మరింత దారుణంగా తయారయ్యింది. 2024–25లో 28.27 శాతం జలాలను మాత్రమే తెలంగాణ వినియోగించుకోగా.. ఏపీ మాత్రం 72.73 శాతం తరలించుకుపోయింది. ఇక ఎన్నడూ లేని విధంగా 2025–26లో ఇప్పటి వరకు కేవలం 25.10 శాతం మాత్రమే జలాలను తెలంగాణ వినయోగించుకుంటే.. పుష్కర కాలంలోనే అత్యధికంగా ఏపీ 74.90 శాతం జలాలను తరలించుకుపోవడం గమనార్హం. అంటే ఈ సంతవ్సరం వాటా (66శాతం) కంటే సుమారు 10 శాతం జలాలను అదనంగా తరలించుకుపోవడాన్ని తెలంగాణ మేధావులు, ఇంజనీర్లు, తెలంగాణీయులు తీవ్రంగా ఆక్షేపిస్తున్నారు. ఈ ఏడు ఎల్‌నినో ప్రభావం కారణంగా సాధారణ వర్షాలు సరిగ్గా కురవవని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇప్పటికే రిజర్వాయర్లలో జలా లు అడుగంటాయి. ఈ నేపథ్యంలో ఏపీ జలచౌర్యానికి అడ్డుకట్ట వేయాల్సిన కాంగ్రెస్ పార్టీ అలసత్వం వహిస్తుంద న్న విమర్శలున్నాయి. కాంగ్రెస్ పార్టీ పాలనా పగ్గాలు చేపట్టిన తరువాతనే ఏపీ అధ్యధికంగా జల దోపిడీ చేస్తుండటాన్ని తెలంగాణీయులు ఎత్తిచూపుతున్నారు.

# సేమ్ సెంటర్... సేమ్ ప్లేస్... ఎటాక్ మోడ్ లో గులాబీ దళం

**వరంగల్, జూన్ 15:** వచ్చే అసెంబ్లీ ఎన్నికల కోసం ప్లాన్ చేస్తోంది బీఆర్ఎస్. ఆ ఊపులోనే?. అధికార కాంగ్రెస్ పార్టీని ఇరుకున పెట్టేందుకు పావులు కదుపుతోంది. అందుకోసం ఎన్నికల ప్రచారంలో హస్తం నేతలు ఇచ్చిన హామీలు, గ్యారంటీలనే అస్త్రాలుగా వాడాలనుకుంటోందట. అసెంబ్లీ ఎలక్షన్స్‌కు ముందు కాంగ్రెస్ నేతలు రకరకాల డిక్లరేషన్స్ ప్రకటించగా. ఇప్పుడు వాటి అమలు కోసం వత్తిడి చేయడంతో పాటు చేయకుంటే ప్రజల్లోకి వెళ్ళి ఉద్యమ రూపం తీసుకువచ్చేందుకు ప్లానింగ్ జరుగుతున్నట్టు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ ఎక్కడైతే డిక్లరేషన్స్ ప్రకటించిందో ఇప్పుడు అదే ప్రాంతాలకు అక్కడి నుంచే సమరానికి సై అంటోంది గులాబీ దళం. రెండు నెలల క్రితం వరంగల్‌లో రైతు డిక్లరేషన్ సభను అలాగే నిర్వహించింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అక్కడే రైతు డిక్లరేషన్‌ను ప్రకటించింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రులు, సీనియర్ నేతలందరూ హాజరైన ఈ సమావేశం బాగా సక్సెస్ అయిందనట్టు బీఆర్ఎస్ భావిస్తోంది. అయితే అదే ఊపుతో నెలకో సభ పెట్టి?దూకుడుగా ముందుకు వెళ్ళాలని అనుకున్నా? ఆ పని జరగలేదు. ఊపు వచ్చాక ఒక్కసారిగా పార్టీ పెద్దలు ఎందుకు ఆగారో అర్థంగాక కింది స్థాయిలో బుర్ర గోక్కుంటున్నారు. రైతుల తర్వాత వెంటనే కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్ మీద పోరాటం చేయాలని భావించింది బీఆర్ఎస్. ఈ నెలలో ఆ సభ నిర్వహిస్తారని మొదట చెప్పినా?. ఒక్కసారిగా సైలెంట్ అయ్యారు. అలా ఎందుకంటే? ప్లానింగ్ మారింది, డిఫరెంట్‌గా ఉండబోతోందన్నది పార్టీ వర్గాల ఆన్సర్. కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేయడానికి తమ దగ్గర ఉన్న ప్రధాన ఆయుధం వారిచ్చిన హామీలు, గ్యారంటీలే అన్నది బీఆర్ఎస్ భావన. వాటిని అమలు చేయలేదని నిరూపించడమే తమకు ప్రధానం అంటున్నారు గులాబీ సీనియర్స్. అలాంటి ఆయుధాన్ని



వెంట వెంటనే వాడేస్తే? ఎన్నికల నాటికి వాడకం కోసం ఏమీ మిగలవని, అధికార కాంగ్రెస్‌పై పోరాటానికి వీటిని పద్ధతిగా వాడాలని డిసైడయ్యారట. మొత్తాన్ని ఒకేసారి ఉపయోగించకుండా? మెల్లిగా, టైం చూసి ఒక్కొక్క అస్త్రాన్ని బయటికి తీసి ప్రభుత్వం మీద ప్రయోగించాలనుకుంటున్నట్టు సమాచారం. యూత్ డిక్లరేషన్‌పై పోరాటాన్ని వాయిదా వేసుకున్నట్టు తెలుస్తోంది. ఒక డిక్లరేషన్‌పై పోరాట సభకు, మరో దానికి మధ్య కనీసం ఆరు నెలల గ్యాప్ ఉంటే బాగుంటుందని పార్టీ పెద్దలు భావిస్తున్నారట. అందుకోసమే రైతు డిక్లరేషన్ పై పోరాటం సక్సెస్ అయిన ఈ సమయంలో వచ్చే ఐదారు నెలలు దాని గురించే మాట్లాడుకునేలా చేసి అదే అంశాన్ని జనాల్లోకి తీసుకెళ్లాలని.. తర్వాత యూత్ డిక్లరేషన్, దాని తర్వాత బీసీ డిక్లరేషన్ లాంటి అంశాలను తీసుకోవాలనుకుంటున్నట్టు సమాచారం. ముందు ఒక కార్యక్రమం చేసి? ఆ హీట్ తగ్గకుండా జాగ్రత్తపడుతూ? అది కాస్త తగ్గుతుందనుకున్నప్పుడు మరో అస్త్రాన్ని బయటికి తీసి ఆ టెంపోని అలాగే మెయిన్‌టెయిన్ చేయాలనుకుంటున్నట్టు సమాచారం. ప్రతిపక్ష పార్టీగా?. ప్రభుత్వం మీద పోరాటానికి కలిసి వచ్చే ఏ అవకాశాన్ని వదులుకోకూడదన్నది బీఆర్ఎస్ భావన.

# నిబంధనలకు నీళ్లు

**నల్గొండ, జూన్ 15 :** ఏదైనా పరిశ్రమలకు అనుమతులు రావాలంటే ఖచ్చితంగా ప్రభుత్వ నిబంధనలు పాటించాల్సిందే. అయితే కొన్ని పరిశ్రమలు అనుమతులు వచ్చిన తర్వాత ఆ నిబంధనలకు నీళ్ళొదులుతూ తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ కేవలం లాభాల కోసం నడుపుతుంటారు. సరిగ్గా ఇదే విధానం నేడు జిల్లాలోని మేళ్లచెరువులో మైహోమ్ (మహా) సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం అవలంబిస్తున్నట్లు తెలుస్తుందిపర్యావరణ, మైనింగ్ నిబంధనల మేరకే తమ సంస్థ పనిచేస్తుందని చెప్పుకునే యాజమాన్యం అక్రమాలకు పాల్పడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. వాస్తవికంగా సున్నపురాయి మైనింగ్ కోసం ప్రభుత్వ భూమిని లీజుకు తీసుకొన్న మైహోమ్ సిమెంట్స్ పరిశ్రమ ఏకంగా మైనింగ్ లీజు భూమిలో ప్రైవేట్ రైల్వే లైన్ నిర్మించుకుందనేది స్థానికులందరూ చర్చించుకుంటున్న మాట. ఇంతటితోనే ఆగకుండా మైనింగ్ లీజు భూమిని కబ్జా చేసి భారీ నిర్మాణాలకు పాల్పడుతున్నారనే అభియోగాలు ఉన్నాయి. అక్రమంగా క్రయ, విక్రయాలు జరుపుతున్నట్లు స్థానికుల ద్వారానే తెలుస్తుంది. చెట్టు పేరు చెప్పి కాయలు అమ్మిన చందంగా మైహోం సిమెంట్ సంస్థ పేరు చెప్పి కొందరు భూకబ్జాదారులు మైహోమ్ సిమెంట్స్ మైనింగ్ లీజు భూమిని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారనీ కొందరు స్థానికుల ద్వారా తెలుస్తుంది. ప్రస్తుత టెక్నాలజీ ప్రకారం మైనింగ్ భూమిలో నిబంధనలకు మించి సెంటు భూమి కబ్జా చేసిన చర్యలు దిగుతున్న ప్రభుత్వాలు మైహోమ్ సిమెంట్స్ పరిశ్రమ యాజమాన్యం ఏకంగా ప్రైవేట్ రైల్వే లైన్ నిర్మించినా అడ్డుకోకపోగా భూకబ్జాలను ప్రోత్సహిస్తున్నారంటూ అటు కేంద్ర, ఇటు రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మేళ్లచెరువు మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 874లో 567 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిలోనే 30ఎకరాల్లో తాసిల్దార్ ఆఫీస్, పోలీస్ స్టేషన్, ఎంపిడిఓ ఆఫీస్, జడ్.పి. హెచ్.ఎస్ స్కూల్ సహా ఎస్సీ కాలనీ ఇండ్లు ఉన్నాయి. ఇదే సర్వే నెంబర్ గల భూమిలో 141.644 హెక్టార్ల భూమిని సున్నపురాయి మైనింగ్ కోసం మైహోమ్ సిమెంట్ పరిశ్రమకు 1983లో ప్రభుత్వం లీజుకు ఇచ్చింది. అప్పటి దేవి సిమెంట్స్ పర్యావరణ అనుమతులు తీసుకొని కేంద్ర ప్రభుత్వ అనుమతుల మేరకు మైనింగ్ కార్యకలాపాలు మాత్రమే నిర్వహిస్తుంది. ఇటీవల 2023లో మైహోమ్ సిమెంట్స్ పర్యావరణ అనుమతులను రెన్యువల్ చేసుకుంది. షరతులతో కూడిన అనుమతులను పర్యావరణ శాఖ జారీ చేసింది. కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పు శాఖ జారీ చేసిన పర్యావరణ అనుమతులకు విరుద్ధంగా మైహోం సిమెంట్స్ పరిశ్రమ మైనింగ్ భూమిలో రైల్వే లైన్ నిర్మాణం చేపట్టిందనేది అందరికి కనిపిస్తున్న విషయమే. మైనింగ్ లీజు అగ్రిమెంట్ ప్రకారం భూమిని మైనింగ్ కోసమే వినియోగించాలి. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన పర్యావరణ అనుమతులు విరుద్ధంగా ఎటువంటి నిర్మాణాలు, ఇతర కార్యకలాపాలు చేపట్టరాదు. ఒకవేళ ఏమైనా నిర్మాణాలు, ఇతర కార్యక్రమాలు చేపట్టినా ఖచ్చితంగా పర్యావరణ శాఖ అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ మైహోమ్ సిమెంట్ పరిశ్రమ పర్యావరణ , మైనింగ్ శాఖ కల్లుగప్పి ఏకంగా ప్రైవేట్ రైల్వే ట్రాక్ నిర్మించుకుందనేది స్థానికంగా పెద్ద ఎత్తున వినిపిస్తున్న విమర్శ. 2009లో ఈ మైనింగ్ భూమిని అనుకొని ప్రభుత్వం రైల్వేలైన్ నిర్మించింది. ప్రభుత్వం నిర్మించిన రైల్వేలైన్ కింద మైహోమ్ సిమెంట్స్ మైనింగ్ భూమి కొంతమేర కోల్పోయింది. మైహోమ్ సిమెంట్స్ సైతం మైనింగ్ భూమిలో ఏకంగా తమ అవసరార్థం రైల్వే లైన్ నిర్మించింది. ఇది కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ జారీచేసిన ఎన్విరాన్మెంట్ క్లియరెన్స్ నిబంధనలకు విరుద్ధంగా ఏర్పరచారనేది ప్రధాన అభియోగం. ఎన్విరాన్మెంట్ క్లియరెన్స్ పత్రంలో కేంద్ర ప్రభుత్వం విధించిన నిబంధన ప్రకారం మాత్రమే మైనింగ్ నిర్వహించాల్సి ఉన్నా అందుకు భిన్నంగా మైహోమ్ సిమెంట్స్ వ్యవహరిస్తుందనీ కొందరు బాహాటంగానే విమర్శిస్తున్నారు. మై హోమ్ సిమెంట్స్ తమ కంపెనీ అవసరార్థం రైల్వే ట్రాక్ నిర్మించుకోవాల్సి వస్తే తన సొంత భూమిలో నిర్మించుకోవాల్సి ఉన్న నిబంధనలకు విరుద్ధంగా సున్నపురాయి మైనింగ్ కోసం కేటాయించిన భూమిలో పర్యావరణాన్ని అనుమతులకు విరుద్ధంగా రైల్వే ట్రాక్ నిర్మించిందనీ ప్రధానంగా వినిపిస్తున్న విమర్శ. ఈ మైనింగ్ భూమి కాకుండా సర్వేనెంబర్ 1057లోని పట్టా భూముల్లో రైల్వే ట్రాక్, లోడింగ్ అన్లోడింగ్ పాయింట్ నిర్మించినప్పటికీ కనీసం గ్రామపంచాయతీ నుండి కూడా ఎటువంటి అనుమతులు తీసుకోలేదనేది కొందరు స్థానికుల వాదన. .2015లో నిర్మించిన ఈ రైల్వే లోడింగ్ పాయింట్ కి ఇప్పటివరకు కనీసం ఇటువంటి పన్నులు కూడా చెల్లించలేదని విశ్వసనీయంగా తెలిసింది. ఈ రైల్వే ట్రాక్, లోడింగ్ పాయింట్ 12 హెక్టార్లలో మైహోమ్ సిమెంట్ నిర్మించగా, రైల్వే ట్రాక్ కోసం 6 హెక్టార్ల మైనింగ్ లీజు భూమిని వాడుకున్నట్లు తెలిసింది. ఆరు నెలలకు ఒకసారి సున్నపురాయి మైనింగ్ కోసం మైహోమ్ సిమెంట్స్ పర్యావరణ అనుమతులు కొనసాగిస్తుండగా, అదేవిధంగా ఎప్పటికప్పుడు మైనింగ్ కార్యకలాపాలపై ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ కేంద్ర ప్రభుత్వ సంస్థ లెక్కలు కడుతున్నప్పటికీ మైనింగ్ భూమిలో మైహోమ్ సిమెంట్ నిర్మించిన రైల్వేట్రాక్ పై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం అందరిని ఆశ్చర్యానికి గురిచేస్తుంది. బహిరంగంగా పర్యావరణ అనుమతులకు ఉల్లంఘించినప్పటికీ పర్యావరణ శాఖ ఇటువైపున కన్నెత్తి చూడదంలేదు అని పలువురు విమర్శిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కన్నుసన్నల్లో నడిచే సున్నపురాయి మైనింగ్ పై మిన్ను కుండటం పట్ల సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం అక్రమ నిర్మాణపై విచారణ జరిపి మైహోం సంస్థ పై చర్యలు తీసుకోవాల్సిందిగా స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# మరో వర్కింగ్ ప్రెసిడెంట్ గా బీసీ నేత.

**కరీంనగర్, జూన్15 :** వచ్చే అసెంబ్లీ ఎన్నికలే టార్గెట్‌గా పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంపై దృష్టి పెట్టింది బీఆర్ఎస్ అధిష్టానం. అందులో భాగంగా సభ్యత్వ నమోదును ప్రయారిటీలో తీసుకుని ఇప్పటికే జిల్లా, నియోజకవర్గ స్థాయి ఇన్చార్జ్‌లను నియమించారు. ఆపని పూర్తవగానే?. గ్రామ, మండల, జిల్లా కమిటీలతో పాటు రాష్ట్ర కార్యవర్గాన్ని కూడా ఏర్పాటు చేయబోతున్నారు. ఈసారి ఆ కార్యవర్గమే సంచలనం అయ్యే అవకాశం ఉందని చెప్పుకుంటున్నాయి గులాబీ వర్గాలు. వెనుకబడిన తరగతులకు ప్రతినిధిగా పార్టీలో ఓ పెద్ద పోస్ట్ క్రియేట్ చేయాలనుకుంటున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం పార్టీ అధ్యక్షుడిగా కేసీఆర్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కేటీఆర్ ఉన్నారు. పార్టీ వ్యవహారాలన్నీ ఈ రెండు పదవుల చుట్టూనే తిరుగుతుంటాయని ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన పనిలేదు. అయితే? ఇక్కడే కొత్త ఆలోచన చేస్తోందట అధిష్టానం. కుటుంబ ముద్ర నుంచి బయటపడటంతో పాటు సామాజిక సమీకరణల్ని గట్టిగా పాటిస్తున్నామని చెప్పే క్రమంలో?కేటీఆర్‌కు సమాంతరంగా మరో వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్ట్‌ని సృష్టించాలనుకుంటున్నట్టు సమాచారం. అధ్యక్ష పదవికి ఎన్నికలు జరిగే సెప్టెంబర్, అక్టోబర్‌లోనే ఈ కొత్త వర్కింగ్ ప్రెసిడెంట్ నియామకాన్ని కూడా చేపట్టాలనుకుంటున్నట్టు తెలుస్తోంది. ఆ పోస్ట్‌లో ఒక బీసీ నేతను నియమించాలనుకుంటున్నారన్నది బీఆర్ఎస్ ఇంటర్నల్ టాక్. కొత్తగా మరో వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఏర్పాటు చేయడానికి చాలా కారణాలు ఉన్నాయని అంటున్నారు పార్టీ నేతలు. ప్రస్తుతం దేశంతో పాటు రాష్ట్రంలో కూడా బీసీ ఉద్యమం వాయిస్ పెరుగుతోంది. కాంగ్రెస్ పార్టీ బీసీలకు అన్యాయం చేసిందని బీఆర్ఎస్ పదేపదే చెబుతోంది. ఈ సమయంలో బీసీలకు న్యాయం చేసేది తామేనని చెప్పుకునే క్రమంలో కేటీఆర్ స్థాయికి సమానంగా ఉండే మరో వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్ట్ సృష్టించి దాన్ని బీసీ నేతలు ఇవ్వాలని భావిస్తున్నారట. అలా?. బీసీ నేతకు పార్టీలో కేటీఆర్‌తో సమాన స్థాయి ఇవ్వడం ద్వారా బలహీనవర్గాలకు ప్రాధాన్యం, కుటుంబ ముద్ర చెరిపేసుకోవడం లాంటి బహుళ లక్ష్యాలను సాధించాలనుకుంటున్నట్టు సమాచారం. ఆ కొత్త పదవికి ఎవర్ని ఎంపిక చేయాలనే దానిపై కూడా కేసీఆర్ కసరత్తు చేస్తున్నట్టు చెబుతున్నారు. హైదరాబాద్ పరిధిలోని మూడు కార్పొరేషన్లకు, హైదరాబాద్ మహబూబ్ నగర్ రంగారెడ్డి జిల్లాల పట్టభద్రుల స్థానానికి త్వరలో ఎన్నికలు రాబోతున్నాయి. కాబట్టి ఆ జిల్లాలకు సంబంధించిన నేతను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రకటిస్తారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

# ఎఐసీసీ రేసులో.....

**హైదరాబాద్ జూన్ 15 :** తెలంగాణ నుంచి ఏఐసీసీలో ఎవరెవరికి చోటు దక్కే అవకాశం ఉంది? ఒకరిద్దరు మంత్రుల్ని కూడా పార్టీ హెడ్క్వార్టర్స్‌కు పంపుతారన్నది నిజమేనా? అసలు మార్పుల విషయమై కాంగ్రెస్ వర్గాల అంచనాలు ఎలా ఉన్నాయి? దేశ వ్యాప్తంగా పార్టీ ప్రక్షాళనకు డిసైడ్ అయ్యింది కాంగ్రెస్ అధిష్టానం. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నాయకుల సేవలు ఉపయోగించుకోవాలని భావిస్తోంది. ఈ ప్రక్రియ గురించి ప్రస్తుతం పార్టీ వర్గాల్లో రకరకాల ఆసక్తికరమైన చర్చలు నడుస్తున్నాయి. ఆలిండియా కాంగ్రెస్ కమిటీలో భారీ మార్పులు ఉంటాయన్న సంకేతాల నడుమ తెలంగాణ నాయకుల స్థానం ఎక్కడన్న ఆరాలు మొదలయ్యాయి. రాష్ట్రం నుంచి ఏఐసీసీలో ఎవరికి చోటు దక్కుతుంది..? ఇక్కడి సీనియర్ నాయకుల సేవల్ని అక్కడ వాడుకోవాలని భావిస్తోందా..!? ఇంతకీ? తెలంగాణ కాంగ్రెస్ నేతల్లో ఎవరు ఏఐసీసీలోకి వెళ్ళబోతున్నారనే చర్చలు పార్టీ వర్గాల్లో జోరుగా జరుగుతున్నాయి. సాధారణంగా ఏఐసీసీ పోస్టుల భర్తీ విషయంలో అన్ని రాష్ట్రాలకు వాటా దక్కుతుంది. అవసరం, అవకాశాన్ని బట్టి ప్రాధాన్యతలు మాత్రమే మారుతుంటాయి. తెలంగాణ నుంచి చాలామంది నాయకులు ప్రస్తుతం ఏఐసీసీ కార్యదర్శులుగా బాధ్యతల్లో ఉన్నారు. మంత్రి శ్రీధర్ బాబు, మధుయాష్కీ.. చిన్నారెడ్డి..వంశీ?సంపత్ లాంటి వాళ్ళు ఆ పదవుల్లో ఇంకా కొనసాగుతున్నారు. ఈసారి ఏఐసీసీలో అధికార ప్రతినిధులు.. మరి కొన్ని పదవుల్లో కూడా తెలంగాణకి ప్రాధాన్యత దక్కే అవకాశం లేకపోలేదు. అయితే?దానికి అనుబంధంగా మరో ఆసక్తికరమైన చర్చ కూడా జరుగుతోంది. రాష్ట్రంలో క్యాబినెట్ విస్తరణ గనుక జరిగితే ఒకరిద్దరు మంత్రులను తప్పిస్తారన్న ప్రచారం ఉంది. అందులోనూ కీలకంగా ఉండే వాళ్లనే బయటికి పంపుతారన్న ప్రచారంతోఒకవేళ అదే జరిగితే వాళ్లని ఎలా సంతృప్తి పరుస్తారన్న ప్రశ్నలు వస్తున్నాయి. కేబినెట్ నుండి తప్పించే పరిస్థితే ఉంటేసదరు నేతల్ని ఏఐసీసీలోకి తీసుకుని పొరుగు రాష్ట్రాలకు పార్టీ ఇన్చార్జులుగా పంపవచ్చని తెలుస్తోంది. పార్టీలో కీలకంగా క్రియాశీలకంగా పని చేసిన వాళ్ళేగనక ఆ లిస్ట్‌లో ఉంటే ఏఐసీసీలోకి తీసుకోవాలన్న ఆలోచన కూడా జరుగుతున్నట్టు చెప్పుకుంటున్నారు. మంత్రులను పక్కనబెడితే పార్టీ కోసం పని చేస్తున్న వారిలో మరికొందరిని అధిష్టానం హెడ్ క్వార్టర్స్‌లోకి తీసుకునే అవకాశం ఉంది. ఇప్పటికే ఎఐసిసిలో ఉన్న వాళ్లను కంటిన్యూ చేస్తారా..? లేదంటే కొత్త వారిని కూడా తీసుకుంటారా అనేది ? వారంలో క్లారిటీ వచ్చే అవకాశం ఉంది

# ప్రభుత్వ చదువులతో విద్యార్థులు ఉన్నతంగా రాణిస్తారు : ఎమ్మెల్యే





**కుషాయిగూడ, జూన్ 15.**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్య నభ్యసించిన విద్యార్థులు ఉన్నతంగా రాణిస్తారని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. గతంలో వసతులు సరిగా లేని సమయంలోనే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న వాళ్ళు గొప్ప గొప్ప స్థానాల్లో ఉన్నారన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కాప్రా సర్కిల్ కుషాయిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పూలు చల్లుతూ విద్యార్థులకు సాదరంగా స్వాగతం పలకడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతిరోజు ఉదయం అల్పాహారం అందేలా కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం అవసరమైన నిధుల విడుదలకు చొరవచూపుతానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు కాలనీ కమిటీల సమాఖ్య సిసిఎస్ అధ్యక్షులు ఎంపల్లి పద్మా రెడ్డి, నాయకులు కాసం మైపాల్ రెడ్డి, నేమురి మహేష్ గౌడ్, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, సారా అనిల్ ముదిరాజ్, గంప కృష్ణ, శ్రీకాంత్ రెడ్డి, రహీం, కొండూరి మురళి పంతులు, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## కాప్రా లో ఫుట్‌బాల్ సందడి - యువతకు పరమేశ్వర్ రెడ్డి ప్రోత్సాహం



కాప్రా జూన్ 15

వల్లువర్ నగర్‌లో ఫుట్‌బాల్ సమ్మర్ క్యాంప్ ముగింపు క్రీడాకారులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేసిన పరమేశ్వర్ రెడ్డి కాప్రా డివిజన్ వల్లువర్ నగర్ ఫుట్‌బాల్ సమ్మర్ కోచింగ్ క్యాంప్ ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై, శిక్షణ పూర్తి చేసుకున్న క్రీడాకారులకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ "ప్రపంచవ్యాప్తంగా ప్రాముఖ్యత గల ఫుట్‌బాల్ క్రీడలో కోచింగ్ తీసుకున్న చిన్నారులకు శుభాకాంక్షలు. క్రీడలు యువత మానసిక, శారీరక దృఢత్వానికి దోహదపడతాయి. యువత పెడదారి పట్టకుండా క్రమశిక్షణ గల పౌరులుగా తీర్చిదిద్దుతాయి" అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు, క్రీడాకారులకు పెద్దపీట వేస్తోందని తెలిపారు. కాప్రా డివిజన్‌లో ఫుట్‌బాల్‌కు ఉన్న ఆదరణను దృష్టిలో ఉంచుకుని గెలీలియో కాలనీ, వల్లువర్ నగర్, కందిగూడాలలో 10 కోట్ల తో అత్యాధునిక హంగులతో ఫుట్‌బాల్ క్రీడా మైదానాలు నిర్మించనున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి స్వతహాగా ఫుట్‌బాల్ క్రీడాకారులని, ఫుట్‌బాల్‌కు మరింత ఆదరణ లభించాలనే ఉద్దేశంతో ఉప్పల్ స్టేడియంలో అంతర్జాతీయ క్రీడాకారులతో మ్యాచ్ నిర్వహించి, ఔత్సాహిక క్రీడాకారులను ప్రోత్సహించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన మాజీ కౌన్సిలర్ రాజేందర్ ని పరమేశ్వర్ రెడ్డి అభినందించారు. వల్లువర్ నగర్ ఫుట్‌బాల్ అకాడమీ సభ్యులు వీ= ని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఎక్స్-సర్వీస్‌మెన్ విభాగం చైర్మన్ పి. రాజేంద్రన్, విజయ్ రెడ్డి ,జాతీయ కార్యదర్శి ఉ జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారుడు పి. ధర్మేందర్‌లి, ు.ఖీ౹ూ లైసెన్స్డ్ కోచ్ పి.డి. ఇమ్మాన్యుయేల్ ఫుట్‌బాల్ కోచ్ వి. శివకుమార్, ప్రధాన కార్యదర్శి పి. గుణశేఖర్ సీనియర్ నాయకులు ఎం. రాజు, పి. రాజశీలన్ మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్, జిల్లా ూవీజ డైరెక్టర్ పూర్ణ యాదవ్, ూవీజ మాజీ డైరెక్టర్ కొబ్బనూరి నాగరాజు, కాప్రా డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు కొబ్బనూరి నాగశేషు, సీనియర్ నాయకులు ,పడమటి మల్లారెడ్డి, బాబురావు, జి. సత్యనారాయణ, తన్నీరు శ్రీహరి, గుణశేఖర్, రాకేష్ యాదవ్, మనోజ్ కుమార్, ఆకుల సంతోష్, రాజశీలన్, కౌకుంట్ల ప్రకాష్ రెడ్డి, అజీజ్, లింగం తదితరులు పాల్గొన్నారు.

## కార్యసిద్ధి హనుమాన్ దేవాలయంలో అమావాస్య అల్పాహార ప్రసాద వితరణ



కాప్రా, జూన్ 15

కుషాయిగూడలోని శ్రీ కార్యసిద్ధి హనుమాన్ దేవాలయం ప్రాంగణంలో ప్రతి అమావాస్య రోజు నిర్వహించే అల్పాహార ప్రసాద వితరణ కార్యక్రమం సోమవారం హనుమాన్ విగ్రహ సమితి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అల్పాహార ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, కార్యసిద్ధి హనుమాన్ దేవాలయ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఆలయ గర్భగుడిలో నవ హనుమాన్ మూర్తులతో పాటు శ్రీరామాయణంలోని ముఖ్య ఘట్టాలను ప్రతిబింబించే సన్నివేశాలను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి, ఆలయ నిర్మాణానికి భక్తులు తమ వంతు సహాయ సహకారాలు అందించి, విరాళాల ద్వారా చేయూతనివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో చల్లా ప్రభాకర్, యావపురం రవి, పనగట్ల చక్రపాణి గౌడ్, పిట్టల రాజు, పాండాల గణేష్ గౌడ్, చల్ల వెంకటేష్, అనిల్ యాదవ్, చల్ల లక్ష్మణ్, నాలచెరువుల జనార్ధన్, హరి నాయక్, బాబు గౌడ్, బాలకృష్ణ, రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మారుతి మిత్ర మండలి ఆధ్వర్యంలో అమావాస్య అన్నప్రసాద వితరణ



కాప్రా, జూన్ 15:

మారుతి మిత్ర మండలి, కుషాయిగూడ వారి ఆధ్వర్యంలో ప్రతి నెల అమావాస్య సందర్భంగా నిర్వహించే అన్నప్రసాద వితరణ కార్యక్రమం సోమవారం కుషాయిగూడలోని శ్రీ శ్రీ శ్రీ పోచమ్మ దేవాలయం లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, మహిళలు లలితా సహస్రనామం, విష్ణు సహస్రనామాల పారాయణం చేశారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో మారుతి మిత్ర మండలి అధ్యక్షుడు గురుమంచి అశోక్ చారి, ప్రధాన కార్యదర్శి వరుగంటి ఆంజనేయులు (హనుమంతు), మచ్చ బాబు గౌడ్, సింగిరెడ్డి వెంకట్ రెడ్డి, మన్మధరావు, అల్లా దుర్గం సతీష్, ఆంజనేయులు యాదవ్, వేణుగోపాల్ చారి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ చదువులతో విద్యార్థులు ఉన్నతంగా రాణిస్తారు: ఎమ్మెల్యే





**కుషాయిగూడ, జూన్ 15:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్య నభ్యసించిన విద్యార్థులు ఉన్నతంగా రాణిస్తారని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. గతంలో వసతులు సరిగా లేని సమయంలోనే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న వాళ ్ళ గొప్ప గొప్ప స్థానాల్లో ఉన్నారన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కాప్రా సర్కిల్ కుషాయిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పూలు చల్లుతూ విద్యార్థులకు సాదరంగా స్వాగతం పలకడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతిరోజు ఉదయం అల్పాహారం అందేలా కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం అవసరమైన నిధుల విడుదలకు చొరవచూపుతానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు కాలనీ కమిటీల సమాఖ్య సిసిఎస్ అధ్యక్షులు ఎంపల్లి పద్మా రెడ్డి, నాయకులు కాసం మైపాల్ రెడ్డి, నేమురి మహేష్ గౌడ్, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, సారా అనిల్ ముదిరాజ్, గంప కృష్ణ, శ్రీకాంత్ రెడ్డి, రహీం, కొండూరి మురళి పంతులు, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# చుక్కలు చూపించిన బైకర్ ఆర్టీసీ డ్రైవర్ తగ్గని పరిస్థితి

**హైదరాబాద్, జూన్ 13 :** హైదరాబాద్ నగరంలో ఓ ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యానికి, ఓ సామాన్య బైకర్ సాహసానికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. ట్రాఫిక్ నిబంధనలను బేఖాతరు చేస్తూ రాంగ్ రూట్‌లో బస్సును నడిపిన డ్రైవర్‌కు ఆ బైకర్ అడ్డుగా నిలిచి, చివరికి బస్సును వెనక్కి తిప్పేలా చేసి హీరోగా నిలిచాడు. వివరాల్లోకి వెళితే.. నగరంలోని రద్దీ ప్రాంతంలో ఓ ఆర్టీసీ డ్రైవర్ ట్రాఫిక్‌కు ఎదురుగా, రాంగ్ రూట్‌లో వేగంగా బస్సును నడుపుకుంటూ వచ్చాడు. అదే సమయంలో అటుగా వస్తున్న ఓ యువకుడు ఇది గమనించి ఏమాత్రం భయపడలేదు. తన బైక్‌ను ఆ బస్సుకు సరిగ్గా ఎదురుగా ఆపేశాడు. బస్సు వేగానికి ఇతరులు పక్కకు తప్పుకున్నా, అతను మాత్రం వెనకడుగు వేయలేదు. దీంతో ఆగ్రహానికి గురైన డ్రైవర్ బస్సును కుడివైపునకు తిప్పి ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించాడు. కానీ, ఆ బైకర్ కూడా పట్టువదలకుండా బస్సు వెళ్లే మార్గానికి మళ్లీ తన బైక్‌ను అడ్డంగా పెట్టాడు. దీంతో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. బైకర్ చర్యను చూసి రోడ్డుపై ఉన్న ఇతర వాహనదారులు కూడా అతనికి మద్దతుగా నిలిచారు. చుట్టూ జనం చేరడం, బైకర్ ఏమాత్రం తగ్గకపోవడంతో ఆర్టీసీ డ్రైవర్‌కు పరిస్థితి అర్థమైంది. చేసేదేమీ లేక, బస్సును నెమ్మదిగా వెనక్కి తిప్పక తప్పలేదు. ఈ నడిరోడ్డు హైడ్రామాను అక్కడున్న వారు తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరించారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు బైకర్ ధైర్యాన్ని మెచ్చుకుంటూ కామెంట్లు పెడుతున్నారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన ఆర్టీసీ డ్రైవర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేస్తున్నారు.

# ఆధ్యాత్మికం పేరుతో గుంటనక్కల సభ భూమన కరుణాకరరెడ్డి, టిటిడి మాజీ చైర్మన్

**తిరుపతి :** టిడిపి అనుబంధ సంస్థ సాధు పరిషత్ ఒక కార్యక్రమం నిర్వహించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి పైన, మా నాయకుడు జగన్మోహన్ రెడ్డి పై,నాపైన అనుచిత వాఖ్యలు చేశారు. టిడిపి నాయకులు కంటే దిగజారి కాషాయ వస్త్రాలు ధరించారని టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ఆరోపించారు. సాధు పరిషత్ అట్లూరి నారాయణ పనులన్నీ శృంగార పారాయణమే, బూతు సినిమాలు. సాయి భక్తి సంఘానికి కసాయివాడు ఐతే ఎలా ఉంటుందో హిందూ సంఘాలు అధ్యక్షుడు ఐతే ఇలానే ఉంటుంది. శ్రీనివాస సరస్వతి..మైనర్ బాలికను అత్యాచారం చేశాడని శ్రీకాకుళం లో కేసు వుంది. ఈ శ్రీను గురించి శ్రీకాకుళం జిల్లాలో ఎవరిని అడిగినా చెప్తారు. పేరులో తప్ప..బుర్రలో సరస్వతి లేని వాడు శ్రీను , స్వామిజీ ముసుగు లో వేషాలు వేస్తున్నాడు. ఆధ్యాత్మికం పేరుతో గుంటనక్కల సభ జరిగింది. హిందూ బంధువులు రావాలని.. ఈ రాబందులు అంతా తిరుపతి లో వాలిపోయారు. మారీచుడు జింక వేషంలో వచ్చినట్లు..స్వామిజీలు నిరసన ర్యాలీ లో పాల్గొన్నారు. శ్రీవారి సేవకులు ను టిడిపి జెండాలు మోసే కూలీలుగా మార్చి ప్రదర్శన చేశాడు. వీళ్లు సాధువులు కాదు..రాక్షస డి.ఎన్. ఏ కల్గిన ఒకే నక్షత్రంలో పుట్టిన పరమ నికృష్ణులు. సన్యాసులు ఉండండి సన్నాసి వెధవలు గా మారకండని అన్నారు. సనాతన హైందవ ధర్మం కాపాడింది వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో.. కాషాయ రాక్షసులు వీళ్ళు, వేయి కాళ్ళ మండపం కూల్చిన చంద్రబాబు వీళ్లకు ఇంద్రుడు గా కనిపిస్తున్నారు. హైందవ గర్జన..స్వాములు ముసుగు వేసుకున్న పచ్చ జెండాలు మోసే నక్క ఊళ. రెండు కొండలు ను ఏడు కొండలు గా జీవో ఇచ్చిన మహనీయుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి . నిత్యం గోవింద నామ స్మరణ తో మార్మోగేల వైఎస్ రాజశేఖర్ రెడ్డి అఖండ హరినామ సంకీర్తన ప్రారంభించారు. జగద్గురు స్వామిజీలు తో తిరుమలలో సమావేశం నిర్వహించిన ఘనత వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో జరిగింది. వేద విశ్వ విద్యాలయం, చతుర్ముఖ రథాలు రాష్ట్రం నలుదిక్కులు హిందూ మతం ప్రచారం చేశారు వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో . ఎస్వీ బిసి భక్తి ఛానెల్ తీసుకు వచ్చింది వైఎస్ రాజశేఖర్ రెడ్డి. గోమాతకు పూజ చేసిన తర్వాత శ్రీవారి దర్శనం కు వెళ్ళాలి అని అలిపిరి వద్ద ప్రారంభించారు వైఎస్ జగన్మోహన్ రెడ్డి. శ్రీనివాస దివ్యహోమాన్ని ప్రారంభించింది వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో. నవనీత సేవ తీసుకు వచ్చింది వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో..కొండపై దళాలూరులు ఉండకుండా తరిమివేసి, హైందవ ధర్మం కాపాడారని అన్నారు. టివి5 చైర్మన్ బి.ఆర్ నాయుడు హయంలో దైవ నామ దయ్యాల భజన ప్రారంభం అయ్యింది,బొంకు.. రాంకు నాయుడు ఈ బి.ఆర్ నాయుడు. హిందూ ముసుగు వైఎస్ రాజశేఖర్ రెడ్డి,జగన్ మోహన్ రెడ్డి పై విష ప్రచారం చేయిస్తున్నాడు బి.ఆర్ నాయుడు . బి.ఆర్ నాయుడు బిగి కౌగిలి సడలింపు దేశం మొత్తం చూసింది. పది లక్షలు డొనేషన్లు కూడా తీసుకునే చివరి టిటిడి చైర్మన్ బి.ఆర్ నాయుడు. పోలీస్ 30 యాక్ట్ పేరుతో అనుమతి ఇవ్వని పోలీసులు, దొంగ స్వామిజీలు యాత్రకు ఎలా అనుమతి ఇచ్చారు. వాళ్లపై ఎందుకు కేసులు పెట్టలేదు. పేదలు కోసం నిరసనగా వెళ్తే 150 మంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పై కేసులు పెట్టారు. బ్లాక్ లో టికెట్లు అమ్ముకునేందుకు అనుమతి ఇస్తే రామ రాజ్యం వస్తుందా. వీళ్ళను కట్టడి చేసి నందుకు మాది రాక్షస రాజ్యం అంటున్నారు. ధర్మ ప్రచారం ఎక్కడైనా జరుగుతుందా . ఈ విధంగా టిడిపి ప్రచారం మొదలు పెట్టాడు బి.ఆర్ నాయుడని అన్నారు.

# పాలసీలు చేయాల్సిన ప్రభుత్వ పెద్దలు కార్మికులను మభ్య పెట్టే ప్రయత్నం

### -సింగరేణికి బకాయి ఉన్న రూ. 50 వేల కోట్లను వెంటనే చెల్లించాలి -బొగ్గుబాయి పర్యటన లో కవిత

మందమర్రి : తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత సోమవారం మందమర్రిలో పర్యటించారు. బొగ్గుబాయి" కార్యక్రమంలో భాగంగా కాసిపేట మైన్ 1 పరిశీలించి కార్మికులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాలసీలు చేయాల్సిన సీఎం, డిప్యూటీ సీఎం లే వినతి పత్రాలిస్తూ సింగరేణి కార్మికులను మభ్య పెడుతున్నారని ఆరోపించారు. డిపెండెంట్ ఉద్యోగాలతో సహా అన్నింటిలో కార్మికులకు అన్యాయం చేస్తున్నారు. కార్మికులకు హెచ్ఎంఎస్, టీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కవిత మాట్లాడుతూ తెలంగాణ లో కొత్త రాజకీయ శక్తిగా వచ్చాం. సింగరేణి బిడ్డల ఆశీర్వాదం కోసం ఇక్కడకు వచ్చాను. తెలంగాణ ఉద్యమంలో కలిసి పనిచేశాం, బీఆర్ఎస్ ప్రభుత్వంలోనూ కలిసి పనిచేశాం. నేను ఎక్కడ ఉన్న కూడా అనునిత్యం మీ పక్కనే ఉండి పోరాటం చేశాను. సింగరేణిలోని మెడికల్ బోర్డు పెట్టకపోతే హైదరాబాద్ లోని సింగరేణి భవన్ ను ముట్టడించాం. ఈ ప్రభుత్వంలో సర్వసామాన్యంగా జరగాల్సిన పనులకు కూడా పోరాటం చేయాల్సి వస్తోందని అన్నారు. హైదరాబాద్, ఢిల్లీలో ఉండి మనకు బొగ్గు బావులు తేవాల్సిన సీఎం, డిప్యూటీ సీఎం లు మీకే వినతి పత్రాలు ఇస్తున్నారు. మనకు ఐటీ సమస్య లేకుండా, నెలకు రెండుసార్లు మెడికల్ బోర్డు పెట్టాల్సిన పనులు ఈ ప్రభుత్వం చేయటం లేదు. చేయాల్సిన పనులు చేయకుండా ఇక్కడకు వచ్చి కార్మికులను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. కానీ కార్మికులతో నిరంతరం ఉండి ఎవరు పోరాటం చేస్తారో మీ అందరికీ తెలుసు. మనకు ముఖ్యంగా హక్కుగా రావాల్సిన డిపెండెంట్ ఉద్యోగాల కోసం పోరాటం చేయాల్సి ఉంది. సింగరేణికి బొగ్గు బావులు తెచ్చుకుంటే దాదాపు లక్ష ఉద్యోగాలు ఇవ్వవచ్చు. కానీ అన్నింటినీ ప్రైవేట్ పరం చేయాలని, అండర్ గ్రౌండ్ మైనింగ్ ను రద్దు చేయాలని ప్రయత్నిస్తున్నారు. టీఆర్ఎస్ కార్మికుల కోసం హెచ్ఎంఎస్ తో కలిసి పోరాటం చేస్తుంది. రానున్న ఏ ఎన్నికల్లోనైనా, పోరాటాల్లోనైనా హెచ్ఎంఎస్ తో కలిసి టీఆర్ఎస్ సంయుక్తంగా పోరాడుతుందని అన్నారు. హెచ్ఎంఎస్ అధ్యక్షులు రియాజ్ ఎక్కడ కాంప్రమైజ్ కాకుండా పోరాటం చేస్తున్న సంగతి మీకు తెలిసిందే. మనకు ఢిల్లీ స్థాయిలో పనులు కావాలంటే జేబీసీసీ లో మనం పోరాడాలి. రియాజ్ అందులో సభ్యులుగా ఉండి సింగరేణి కార్మికుల కోసం పోరాటం చేస్తున్నారు. పాలసీలు చేయాల్సిన ప్రభుత్వ పెద్దలు కార్మికులను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. నిజానికి సింగరేణిని కాపాడాలనే చిత్తశుద్ధి ఉ ంటే సింగరేణికి బకాయి ఉన్న రూ. 50 వేల కోట్లను వెంటనే చెల్లించాలి. వారం రోజుల పాటు బాయి బాట కార్యక్రమం ఉంటుంది. కాసిపేట నుంచే బాయి బాట కార్యక్రమం మొదలుపెట్టాం. ఓపెన్ కాస్ట్ మైనింగ్ పెంచే ప్రయత్నం చేస్తున్న సింగరేణి కార్మికుల భద్రతను పట్టించుకోవటం లేదని అన్నారు. ఇప్పుడున్న కార్మికుల్లో చాలా మంది యువ వయసు వాళ్లు ఉన్నారు. వారి పిల్లలు చదువుకునేందుకు సరైన స్కూల్స్, సరైన హాస్పిటల్స్ లేవు. అన్నింటిల్లో ప్రైవేట్ ను తీసుకొచ్చి వైద్యాన్ని మరింత ఖరీదు చేసే ప్రయత్నం చేస్తున్నారు. అందుకే తెలంగాణ రక్షణ సేన పాంచజన్యం అనే ఐదు కీలక అంశాలతో ముందుకు వచ్చింది. కార్పొరేట్ స్థాయి విద్య, వైద్యాన్ని పూర్తిగా ఉచితంగా మేము అందజేస్తాం. ఈ ప్రభుత్వం ఇవ్వగలిగే స్థాయిలో ఉండి ఇవ్వటం లేదు. టీఆర్ఎస్ పెట్టిన తర్వాత సింగరేణిలో నా మొదటి యాత్ర ఇది. మా పార్టీకి సింగరేణి కార్మికుల దీవెనార్తి ఉండాలని కోరుకుంటున్నానని అన్నారు.

# నా కోరిక తీరిస్తేనే సినిమాల్లో ఛాన్స్

### యువనటిని వేధించిన క్యాస్టింగ్ ఆర్టిస్ట్.. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు

హైదరాబాద్ : కొన్నేళ్లుగా సినీ రంగంలో ఉన్న ఓ యువనటి(21)కి ఓ సినిమాలో హీరోయిన్ స్నేహితురాలి పాత్ర ఇప్పిస్తానని ప్రసాద్ అనే క్యాస్టింగ్ ఆర్టిస్ట్ సంప్రదించాడు. 2025 అక్టోబర్ నుండి డిసెంబర్ వరకు ఈ సినిమా షూటింగ్ పూర్తవగా, నటికి ఇవ్వాల్సిన రూ. 90 వేల పారితోషికం, రూ. 38 వేల ప్రయాణ చార్జీలు ఇవ్వకుండా ప్రసాద్ తప్పించుకున్నాడు. ఈ ఏడాది ఫిబ్రవరి 18వ తేదీన తనను కలవమని చెప్పి, బలవంతంగా కారులో ఎక్కించుకుని, తన కోరిక తీరిస్తే ఇతర సినిమాల్లో అవకాశాలు ఇప్పిస్తానని సదరు నటిపై లైంగిక దాడికి ప్రయత్నించాడు. నిందితుడి నుండి తప్పించుకుని, జరిగిన విషయాన్ని తన తల్లికి చెప్పడంతో, ప్రసాద్ను బాధితురాలి తల్లి నిలదీసింది. దీంతో ప్రసాద్ బాధితురాలి తల్లిని కూడా దూషించడంతో, పోలీసులకు ఫిర్యాదు చేసారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసారు.

తెలంగాణ షాన్
TELANGANA SHAAN
మంగళవారం, జూన్ 16, 2026
Tuesday, June 16, 2026

# హ్యాట్రిక్ పై యోగి గురి

**లక్నో, జూన్ 15 :** భారత రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యత కలిగిన ఉత్తరప్రదేశ్ లో ఎన్నికల వేడి అప్పుడే మొదలైంది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో చారిత్రాత్మక హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని భారతీయ జనతా పార్టీ రికొత్త వ్యూహాలకు పదును పెడుతోంది. గతంలో లాగా కాకుండా, ఈసారి ఎన్నికలకు ముందే యోగి ఆదిత్యనాథ్ తామే సీఎం అభ్యర్థిగా బరిలోకి దిగుతారని పార్టీ జాతీయ నాయకత్వం అధికారికంగా ప్రకటించడం గమనార్హం. గత లోక్‌సభ ఎన్నికల్లో సమాజ్ వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ సాధించిన విజయాలకు బ్రేక్ వేయడమే కాకుండా, విపక్షాల ఓటు బ్యాంకును ముక్కలు చేసేందుకు యోగి మార్క్ పొలిటికల్ స్కెచ్ సిద్ధమైంది. అఖిలేష్ యాదవ్ విస్తృతంగా ప్రచారంలోకి తెచ్చిన ఖఅం పిచ్డే, దళిత్, అల్పసంఖ్యాక్ – వెనుకబడిన, దళిత, మైనారిటీల కూటమి ఫార్ములాను దెబ్బతీయడమే యోగి ప్రధాన ఎజెండా. దీనికోసం ఇటీవల యూపీ క్యాబినెట్‌ను విస్తరిస్తూ ఆరుగురు కొత్త మంత్రులతో యోగి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ విస్తరణ వెనుక పక్కా సోషల్ ఇంజనీరింగ్ దాగి ఉంది. సమాజ్ వాదీ పార్టీ బలంగా నమ్ముకునే యాదవేతర ఓబీసీ , దళిత సామాజిక వర్గాలకు మంత్రివర్గంలో పెద్దపీట వేయడం ద్వారా అఖిలేష్ యాదవ్ ఓటు బ్యాంకు పునాదులను కదిలించేలా యోగి వ్యూహాత్మక అడుగులు వేశారు. ఎస్పీ సాంప్రదాయ ఓటు బ్యాంకు అయిన యాదవేతర వెనుకబడిన కులాలను తమ వైపు తిప్పుకోవడం ద్వారా అఖిలేష్ ఖఅం ముసుగును తొలగించాలని యోగి ప్లాన్ చేస్తున్నారు. సమాజ్ వాదీ పార్టీలో యాదవుల ఆధిపత్యంపై అసంతృప్తిగా ఉన్న ఇతర ఓబీసీ ఉప–కులాలను మౌర్య, కుర్మీ, నిషాద్, రాజ్‌భర్ వంటి వర్గాలను బీజేపీ తన వైపు తిప్పుకుంటోంది. ఇందుకోసం చిన్న చిన్న ప్రాంతీయ పార్టీలతో పొత్తులను మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా ఆయా సామాజిక వర్గాల చివరి లబ్ధిదారుడికి చేరేలా యోగి స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. కుల సమీకరణాలతో పాటు రాష్ట్రాన్ని కుదిపేసే క్రైమ్, గ్యాంగ్‌స్టర్ సంస్కృతిని ఉక్కుపాదంతో అణచివేయడం ద్వారా శాంతిభద్రతల అంశాన్ని మరోసారి తన ప్రధాన ఆయుధంగా మలుచుకుంటున్నారు. ఇక రాజకీయంగా విపక్షాలను డిఫెన్స్‌లో పడేసేందుకు యోగి ఆదిత్యనాథ్ మరోసారి తన పాత వైభవమైన 'హార్డ్ హిందుత్వ' అస్త్రాన్ని ప్రయోగించారు. ఇటీవల



కుషీనగర్, గొండాలలో జరిగిన బహిరంగ సభల్లో ఆయన నేరుగా సమాజ్ వాదీ పార్టీని రామ విరోధులు గా అభివర్ణించారు. కాంగ్రెస్, సమాజ్ వాదీ పార్టీలు దశాబ్దాల పాటు అయోధ్య రామమందిర నిర్మాణాన్ని అడ్డుకున్నాయని, 500 ఏళ్ల హిందువుల నిరీక్షణకు డబుల్ ఇంజన్ సర్కార్ మాత్రమే ముగింపు పలికిందని గుర్తు చేశారు. అఖిలేష్ యాదవ్ ఇటీవల అవలంబిస్తున్న సాఫ్ట్ హిందుత్వ పాలిటిక్స్‌ను యోగి తీవ్రంగా ఎండగడుతున్నారు. అభివృద్ధి జాతీయ భద్రత అనే అంశాలను కూడా యోగి ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తున్నారు. ఒకప్పుడు అల్లర్లకు, మాఫియాకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న ఉత్తరప్రదేశ్‌లో ఇప్పుడు బ్రహ్మోస్ మిసైల్ తయారీ కేంద్రాలు వస్తున్నాయని, పాకిస్తాన్‌ను సైతం గడగడలాడించే రక్షణ పరిశ్రమలు యూపీ గడ్డపై ఏర్పాటవుతున్నాయని ఆయన చెప్పుకొస్తున్నారు. నవ్య అయోధ్య, కాశీ విశ్వనాథ్ కారిడార్ ద్వారా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసి స్థానిక యువతకు ఉపాధి కల్పించామని, గతంలో జరిగిన పరీక్షల పేపర్ లీకేజీల నిందితులను జైలుకు పంపామని వివరిస్తున్నారు. అఖిలేష్ యాదవ్ కులాల వారీగా ఓట్లను ఏకం చేసే ప్రయత్నం చేస్తుంటే.. యోగి ఆదిత్యనాథ్ మాత్రం ఆ ఓట్లను చీలుస్తూ హిందూ ఓటు బ్యాంకును ఏకం చేస్తూనే, యాదవేతర వెనుకబడిన వర్గాలను అధికారంలో భాగస్వాములను చేసే ద్వంద్వ వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. గడిచిన రెండు ఎన్నికల కంటే కూడా 2027 లో యూపీ అసెంబ్లీలో భారీ మెజార్టీతో బీజేపీ తిరిగి పీఠాన్ని దక్కించుకుంటుందని యోగి ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రూరమైన పొలిటికల్ మైండ్ గేమ్‌లో అఖిలేష్ యాదవ్ యోగి స్పీడ్‌ను ఎంతవరకు తట్టుకుంటారనేది రాబోయే రోజుల్లో తేలనుంది.

# బంజారాహిల్స్ టూ పీవీఎక్స్ ప్రెస్ హైవే

**హైదరాబాద్ జూన్ 15 :** హైదరాబాద్ నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా కీలక కారిడార్లను అభివృద్ధి చేసేందుకు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ సరికొత్త మౌలిక వసతుల ప్రాజెక్టును తలపెట్టింది. ప్రధాన నగరం నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి ప్రయాణం సాఫీగా సాగేలా సరికొత్త ఫ్లైఓవర్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. బంజారాహిల్స్ రోడ్డు నంబరు 1లోని జీవీకే వన్ మాల్ వద్ద ప్రారంభమై.. మాసబ్‌ట్యాంక్ మీదుగా ప్రస్తుతం ఉన్న పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వేకు అనుసంధానం చేసేలా సుమారు 4 కిలోమీటర్ల పొడవైన పైవంతెనను నిర్మించనున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు సంబంధించి హెచ్ఎండీఏ ఇప్పటికే క్షేత్రస్థాయి సర్వే పనులను ప్రారంభించింది. రానున్న రెండేళ్ల కాలంలోనే ఈ కారిడార్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం నగరం నుంచి ఎయిర్‌పోర్టుకు వేగంగా చేరుకోవడానికి పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే అందుబాటులో ఉన్నప్పటికీ ప్రధాన నగరం నుంచి ఆ ఎక్స్‌ప్రెస్‌వేను చేరుకోవడమే ప్రయాణికులకు పెద్ద నరకంగా మారింది. ముఖ్యంగా రద్దీ వేళల్లో బంజారాహిల్స్ రోడ్డు నంబరు 1, జీవీకే మాల్, తాజ్‌కృష్ణ, కేర్ ఆసుపత్రి, మాసబ్‌ట్యాంకు జంక్షన్లను దాటడానికి వాహనదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. కొన్నిసార్లు ఈ కొద్దిపాటి దూరం దాటడానికే గంటల కొద్దీ సమయం పడుతుండటంతో విమాన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కొత్త ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే బంజారాహిల్స్, మాసబ్‌ట్యాంక్ వైపు ఇరువైపులా ట్రాఫిక్ సమస్యకు పెద్ద ఊరట లభించనుంది. బేగంపేట, సోమాజిగూడ నుంచి వచ్చే వాహనదారులు పంజాగుట్ట ఫ్లైఓవర్ ద్వారా నేరుగా ఈ కొత్త జీవీకే ఫ్లైఓవర్ ఎక్కి ఎక్కడా ఆగాల్సిన అవసరం లేకుండా ఆరాంఘర్ జంక్షన్‌కు, అక్కడి నుంచి నేరుగా ఎయిర్‌పోర్టుకు చేరుకోవచ్చు. ఈ ఫ్లైఓవర్ నిర్మాణంలో భాగంగా ప్రయాణికుల సౌకర్యార్థం వ్యూహాత్మక ర్యాంపులను డిజైన్ చేస్తున్నారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 12 ప్రాంతంలో ఒక డౌన్ ర్యాంపును నిర్మించనున్నారు. ఇది ఎయిర్‌పోర్టు వైపు నుంచి వచ్చే వాహనాలు రోడ్డు నంబరు 10, 12 వైపు వెళ్లేందుకు ఉపయోగపడుతుంది. అలాగే ఖైరతాబాద్, సోమాజిగూడ నుంచి చింతల్‌బస్తీ మీదుగా రోడ్డునంబర్ 12 వైపు వెళ్లే వాహనాల కోసం చింతల్‌బస్తీ జంక్షన్ వద్ద ప్రధాన ఫ్లైఓవర్ కింద నుంచి మరో చిన్న పైవంతెన నిర్మించాలని అధికారులు యోచిస్తున్నారు. ఇక లక్డీకపూల్, మాసబ్‌ట్యాంక్ జంక్షన్ వైపు నుంచి వచ్చే వాహనాలు కొత్తగా నిర్మించే ఫ్లైఓవర్ పైకి సాఫీగా వెళ్లేందుకు వీలుగా ఎన్ఎండీసీ భవనం ముందు ఒక అప్ ర్యాంపును ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక త్వరలోనే సిద్ధం కానుందని హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ రవీందర్ తెలిపారు. డీపీఆర్ రూపకల్పన పూర్తయిన తర్వాత ప్రాజెక్టుకు అయ్యే మొత్తం వ్యయం, భూసేకరణ అవసరాలు, ఇతర సాంకేతిక అంశాలపై పూర్తి స్పష్టత వస్తుందని ఆయన పేర్కొన్నారు. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ కష్టాలను శాశ్వతంగా దూరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ పైవంతెన నిర్మాణానికి కృతనిశ్చయంతో ఉందని, నిధుల కొరత లేకుండా వేగంగా పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ఈ ఫ్లైఓవర్ పూర్తయితే ఎయిర్‌పోర్ట్ ప్రయాణికులతో పాటు పశ్చిమ హైదరాబాద్ ప్రజలకు సైతం ఎంతో వెసులుబాటు లభిస్తుంది.

# నిధుల్లేక నీరసిస్తున్న పాఠశాల పనులు



**నల్గొండ, జూన్ 15 :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠా త్మకంగా చేపట్టిన 'మన ఊరు – మన బడి' బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోంది. గత ప్రభుత్వ హయాం లో చేసిన పనులకు సంబంధించి రూ. 300 కోట్లకు పైగా చెల్లించాల్సి ఉంది. ప్రతి నెలా రూ.50 కోట్ల చొప్పున విడుదల చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ సర్కార్.. గత ఏప్రిల్ నెలలో మాత్రమే రూ.50 కోట్లు చెల్లించింది. విడుదల చేసిన దాంట్లోనూ రూ. 46 కోట్లు ఓ పెద్ద కంపెనీకే ఇచ్చిందని చిన్న కాంట్రాక్టర్లు చెబుతున్నారు. పను లు చేపట్టి మూడేళ్లవుతున్నా బిల్లులు రాకపోవడంతో చిన్న కాంట్రాక్టర్ల పరిస్థితి దయనీయంగా మారింది. బీఆర్ఎస్ హయాంలో మన ఊరు – మన బడి కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 9 వేల ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ, నిర్మాణ పనులు చేపట్టింది. దాదాపు వెయ్యి మంది కాం ట్రాక్టర్లు ఈ పనులు చేశారు. డైనింగ్ హాల్, మరుగుదొడ్ల నిర్మాణం, కాంపౌండ్ వాల్, ఎలక్ట్రికల్ వంటి మైనర్ పనులను చిన్న కాంట్రాక్టర్లు అప్పగించగా, పేయంటింగ్, స్మార్ట్ క్లాస్‌లకు సంబంధించి డిజిటల్ బోర్డులు ఏర్పాటు తదితర పెద్ద పనులను ఓ బడా కంపెనీకి ఇచ్చారు. వెయ్యి మంది కాంట్రాక్టర్లలో రూ.10 లక్షల లోపు పనులు చేసిన వారు 600 మంది వరకు ఉంటారు. ఇందులో రూ.5 లక్షల లోపు పనులు చేసిన వాళ్లకు దాదాపు రూ.141 కోట్లు, రూ.5– 10 లక్షల లోపు రావాల్సిన బిల్లులు రూ.75 కోట్లు, రూ.10–30 లక్షల లోపు రూ.75 కోట్లు, రూ.30 లక్షలకు పైగా రావాల్సిన బిల్లులు రూ. 50 కోట్లకుపైగా ఉంటాయి. మొత్తం కలిపి చిన్న కాంట్రాక్టర్లకు రూ.350 కోట్ల వరకు చెల్లించా ల్సి ఉంది. ఇందులో రూ.50 కోట్లు విడుదల చేయగా ఇంకా రూ.300 కోట్లు చెల్లించాల్సి ఉం ది. బడా కంపెనీలకు రూ.650 కోట్లకు దాదాపు క్లియర్ చేసినట్లుగా ఓ కాంట్రాక్టర్ తెలిపారు. అప్పులు చేసి మరీ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించామని, బిల్లులు రాకపోవడంతో వడ్డీ భారం పెరుగుతుందని చిన్న కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకేసారి రూ.100 కోట్లు చెల్లిస్తే మైనర్ పనులు చేసిన వారి సమస్యలు పరిష్కారమవుతాయని అంటున్నారు. రూ.5 లక్షల లోపు బిల్లులకు కూడా మూడేళ్లుగా ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. పెద్ద కాంట్రాక్టర్లకు దాదాపు 99 శాతం బిల్లులు క్లియర్ చేసిన ప్రభుత్వం.. తమకు రేపుమాపు అంటూ కాలయాపన చేస్తుందని అంటున్నారు. ప్రభుత్వాన్ని బిల్లులు అడిగితే డబ్బుల్లేవు, ఉన్నప్పుడు ఇస్తామని అంటుంది. ఎప్పుడు అడిగినా ఇదే మాట చెబుతుంది. గత ప్రభుత్వంలో కూడా బిల్లుల చెల్లింపులో ఇబ్బందులు ఉన్నప్పటికీ.. ఈ ప్రభుత్వంలో పరిస్థితి దారుణంగా ఉంది. ప్రతి నెలా రూ.50 కోట్ల చొప్పున విడుదల చేస్తానని గత ఏప్రిల్ నెలలో మాత్రమే రూ.50 కోట్లు ఇచ్చింది. ఇందులోనూ 90 శాతం వరకు ఓ బడా కంపెనీకే పోయాయి. ఈనెలలో మరో రూ.50 కోట్లు మంజూరు చేశామంటున్నారు. అవి ఇంకా జమ కాలేదు. అధికారులను అడిగితే నేడోరేపో జమ అవుతాయని అంటున్నారు.

# కాంగ్రెస్ గూటికి జగన్ చక్రం తిప్పుతున్న రేవంత్



**హైదరాబాద్, జూన్ 15 :** రెండు తెలుగు రాష్ట్రాల రాజకీయాలు ఇప్పుడు ఒకదానికొకటి పెనవేసుకుని, అత్యంత ఆసక్తికరమైన చెస్ గేమ్‌ను తలపిస్తున్నాయి. ఒకవైపు ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కేంద్రంలోని ఎన్డీయే కూటమికి వ్యతిరేకంగా మెల్లగా గళం విప్పుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. జగన్ ప్రధాని మోదీ లేదా కేంద్ర ప్రభుత్వంపై నేరుగా వ్యక్తిగత విమర్శలు చేయకుండా, కేవలం విధానపరమైన వ్యతిరేకతను మాత్రమే ప్రదర్శిస్తూ ఆచి తూచి అడుగులు వేస్తున్నారు. ఇదే సమయంలో ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు కర్ణాటక నుంచి దక్కాల్సిన రాజ్యసభ సీటు చివరి క్షణంలో సాంకేతిక, రాజకీయ కారణాల వల్ల చేజారడం గమనార్హం. ఈ పరిణామాలు ఏపీలోనే కాకుండా, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పొలిటికల్ వ్యూహాల్లోనూ పెను మార్పులకు కారణమవుతున్నాయి. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎన్డీయే కూటమికి దూరంగా జరుగుతూ, లోపాయకారీగా కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారనే సంకేతాలు పంపడం వెనుక పెద్ద వ్యూహమే ఉంది. ఏపీలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, బీజేపీ కూటమిని ఒంటరిగా ఎదుర్కోవడం కంటే, జాతీయ స్థాయిలో యాంటీ–బీజేపీ శక్తులతో జతకట్టడం మేలనే యోచనలో ఆయన ఉన్నట్లు తెలుస్తోంది. దీనిని పసిగట్టిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి.. శుక్రవారం నాటి మీడియా చిట్‌చాట్‌లో జగన్‌కు అనుకూలంగా సానుభూతి వ్యాఖ్యలు చేయడం రాజకీయ వర్గాలను ఆశ్చర్యపరిచింది. ఏపీలో జగన్ సభలకు, ర్యాలీలకు కూటమి ప్రభుత్వం అనుమతులు నిరాకరిస్తోందంటూ రేవంత్ మాట్లాడటం వెనుక.. భవిష్యత్తులో జగన్ కాంగ్రెస్‌కు దగ్గరైతే తద్వారా వచ్చే పొలిటికల్ మైలేజీని ఒడిసిపట్టాలనే ముందస్తు ప్లాన్ కనిపిస్తోంది. ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుతో నొచ్చుకున్న ఒక వర్గాన్ని శాంతపరిచేందుకే, జగన్ సభల అనుమతులపై రేవంత్ సానుభూతి అస్త్రం విసిరారనే ప్రచారం సాగుతోంది. హైదరాబాద్ గుండెకాయ లాంటి అమీర్‌పేట్ జంక్షన్‌లో సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా దివంగత నేత ఎన్టీ రామారావు 23 అడుగుల భారీ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించడం తెలంగాణ రాజకీయాల్లో పెను దుమారం రేపింది. కాంగ్రెస్‌కు బద్ధశత్రువుగా ఉన్న ఎన్టీఆర్ విగ్రహాన్ని కాంగ్రెస్ ప్రభుత్వమే పెట్టడంపై తెలంగాణ సెంటిమెంట్ ఉన్న ఒక వర్గం తీవ్ర అసంతృప్తికి లోనైంది. ఈ చర్యతో బీఆర్ఎస్, మలిదశ ఉద్యమకారుల నుంచి రేవంత్ విమర్శలు ఎదుర్కొన్నారు. దీంతో అప్రమత్తమైన రేవంత్ రెడ్డి.. తెలంగాణలోని వైఎస్సార్ అభిమానులను, రెడ్డి సామాజికవర్గాన్ని సమతూకం చేయడానికి జగన్ ప్రస్తావన తెచ్చారని విశ్లేషకులు భావిస్తున్నారు. ఎన్టీఆర్ విగ్రహం ద్వారా ఆంధ్రా సెటిలర్లు, టీడీపీ సానుభూతిపరుల ఓట్లను కొల్లగొట్టడం.. అలాగే జగన్ సభలపై సానుభూతి చూపడం ద్వారా వైఎస్సార్ ఓటు బ్యాంకును కాపాడుకోవడం రేవంత్ మార్క్ డబుల్ గేమ్ . ఈ మొత్తం పరిణామాల వెనుక ఉన్న అసలు లక్ష్యం.. త్వరలో రాబోయే హైదరాబాద్ నగరపాలక సంస్థ ఎన్నికలే. హైదరాబాద్ పరిధిలో ఆంధ్రా మూలాలున్న ఓటర్లు, సెటిలర్లు గెలుపోటములను శాసిస్తారు. గతంలో ఈ ఓటు బ్యాంక్ అంతా బీఆర్ఎస్ వైపు నిలిచింది. ఇప్పుడు కేసీఆర్ బలహీనపడటంతో ఆ ఓట్లను కాంగ్రెస్ ఖాతాలో వేసుకోవడమే రేవంత్ రెడ్డి ఏకైక అజెండా. అందుకోసమే అటు ఎన్టీఆర్ అభిమానులను, ఇటు వైఎస్సార్ అనుచరులను ఒకేలా ప్రసన్నం చేసుకునే దిద్దుబాటు చర్యలకు ఆయన శ్రీకారం చుట్టారని అంటున్నఏపీలో షర్మిల రాజ్యసభ సీటు మిస్ అవ్వడం కూడా జగన్–కాంగ్రెస్ సాన్నిహిత్యానికి మార్గం సుగమం చేస్తోందనే వాదన ఉంది. ఒకవేళ షర్మిలను కాంగ్రెస్ అధిష్ఠానం పార్లమెంట్‌కు పంపి ఉంటే, జగన్ కాంగ్రెస్ వైపు చూడటం అసాధ్యమయ్యేది. కానీ ఇప్పుడు మారిన సమీకరణాల్లో జగన్ కేంద్రంపై ఒత్తిడి పెంచుతూనే, కాంగ్రెస్‌తో ఫ్రెండ్‌షిప్‌కు సై అంటున్నట్లు సంకేతాలు ఇస్తున్నారు. మొత్తానికి ఏపీలో జగన్ వేస్తున్న అడుగులు.. తెలంగాణలో రేవంత్ రెడ్డి రాస్తున్న పొలిటికల్ స్క్రిప్ట్‌లు రెండూ ఒకదానికొకటి ముడిపడి సాగుతున్నాయి. ఇరు రాష్ట్రాల సరిహద్దుల్లో రేవంత్ రెడ్డి నడుపుతున్న ఈ మైండ్ గేమ్ రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌ను ఏ తీరానికి చేరుస్తుందో చూడాలి.

# దూకుడు ప్రదర్శించని బీఆరెస్

**హైదరాబాద్, జూన్ 15 :** తెలంగాణ రాజకీయాల్లో భారత్ రాష్ట్ర సమితి ప్రస్తుతం ఒక విలక్షణమైన, అత్యంత సంక్లిష్టమైన దశను ఎదుర్కొంటోంది. అసెంబ్లీ ఎన్నికల పరాజయం తర్వాత, పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవలేకపోవడం గులాబీ శ్రేణులను తీవ్ర నైరాశ్యంలోకి నెట్టింది. పార్టీ పయనంపై రకరకాల ప్రచారాలు జరుగుతున్న సమయంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అంతర్గత సమావేశాల్లో వచ్చే ఎన్నికల్లో మనది ఒంటరి పోరే.. ఏ పార్టీతోనూ పొత్తులు ఉండవు అని గట్టిగా చెప్తున్నప్పటికీ, రాజకీయ వర్గాల్లో మాత్రం ఆ మాటలపై ఇంకా నమ్మకం కలగడం లేదు. దీనికి ప్రధాన కారణం.. కేంద్రంలోని బీజేపీపై, మోదీ ప్రభుత్వంపై కేటీఆర్ గానీ, కేసీఆర్ గానీ ఆశించిన స్థాయిలో దూకుడు ప్రదర్శించకపోవడమే. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలను నిశితంగా గమనిస్తే, బీఆర్ఎస్ సాంప్రదాయ ఓటు బ్యాంకు క్రమంగా బీజేపీ వైపు మళ్లినట్లు స్పష్టమైంది. గతంలో గులాబీ వైపు నిలిచిన అర్బన్, సెమి–అర్బన్, హిందూ ఓటర్లు గంపగుత్తగా కమలం వైపు మొగ్గు చూపారు. తెలంగాణలో బీఆర్ఎస్ ఖాళీ చేసిన ప్రతిపక్ష స్థానాన్ని తామే భర్తీ చేశామని, కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం తామేనని బీజేపీ గట్టిగా చాటుకుంటోంది. ఇలాంటి తరుణంలో, తమ ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెస్ మాత్రమేనని, బీజేపీకి అసలు క్షేత్రస్థాయి బలం లేదని కేటీఆర్ ప్రకటిస్తున్నారు. కానీ, తమ ఓట్లను లాగేసుకున్న బీజేపీని ధాటుగా ఎదుర్కోకుండా, కేవలం కాంగ్రెస్‌నే టార్గెట్ చేయడం పొలిటికల్ సర్కిల్స్‌లో పలు అనుమానాలకు తావిస్తోంది. బీజేపీపై సాఫ్ట్ పాలిటిక్స్ నడుపుతూ.. రేపటి ఎన్నికల్లో ఆ పార్టీనే మాకు ప్రధాన ప్రత్యర్థి అని చెప్తే ప్రజలు కన్విన్స్ అవ్వడం కష్టమేన్న అభిప్రాయం వినిపిస్తోంది. బీఆర్ఎస్, బీజేపీల మధ్య లోపాయకారీ ఒప్పందం ఉందంటూ కాంగ్రెస్ చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టడంలో బీఆర్ఎస్ అధినాయకత్వం విఫలమవుతోంది. కవిత బెయిల్ వ్యవహారం దగ్గర నుంచి నేటి వరకు కేంద్ర సంస్థల దూకుడు తగ్గడం, పార్లమెంట్‌లో కీలక బిల్లులపై బీఆర్ఎస్ వ్యూహాత్మక మౌనం వహించడం వంటి పరిణామాలు బీజేపీ–బీఆర్ఎస్ భాయ్ భాయ్ అనే రూమర్లకు మరింత ఆజ్యం పోస్తున్నాయి. నిత్యం సోషల్ మీడియాలో, వార్తల్లో విలీనం లేదా పొత్తుల గురించిన రచ్చ జరుగుతూనే ఉంది. ఈ ప్రచారానికి శాశ్వతంగా చెక్ పెట్టాలంటే కేవలం ఆఫ్‌లైన్ ప్రకటనలు సరిపోవు, క్షేత్రస్థాయిలో బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలపై ఆన్‌లైన్, ఆన్‌గ్రౌండ్ పోరాటాలు చేయాల్సి ఉంటుందని అంటున్నారు. త్వరలో జరగబోయే గ్రేటర్ ఎన్నికలు బీఆర్ఎస్‌కు ఒక పెద్ద యాసిడ్ టెస్ట్. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ తన ఉనికిని కాపాడుకోవాలంటే.. అటు కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూనే, ఇటు కేంద్రంలో ఉన్న బీజేపీ తెలంగాణకు చేసిన అన్యాయాలను అంతే తీవ్రంగా నిలదీయాలి. అలా కాకుండా కేవలం రేవంత్ రెడ్డి ప్రభుత్వంపైనే 100% ఫోకస్ పెట్టి, కేంద్రంపై చిన్న విమర్శ కూడా చేయకపోతే, ప్రజలు బీఆర్ఎస్‌ను కేవలం ఒక 'బి–టీమ్' గానే చూసే ప్రమాదం ఉంది. ఏదైనా ఒక ప్రాంతీయ పార్టీ జాతీయ పార్టీలతో తలపడేటప్పుడు రెండు వైపులా సమానమైన దూకుడు ప్రదర్శించినప్పుడే పొలిటికల్ సీరియస్‌నెస్ కనిపిస్తుంది. కేటీఆర్ మాటలకు, చేతలకు పొంతన లేదనే విమర్శలు పోవాలంటే.. బీజేపీ హిడెన్ ఎజెండాను కూడా గులాబీ పార్టీ అంతే ధీటుగా బట్టబయలు చేయాలి. లేదంటే, తాము ఒంటరిగానే పోటీ చేస్తామని బీఆర్ఎస్ ఎంత మొత్తుకున్నా, విశ్లేషకులు గానీ, అటు ఓటర్లు గానీ దాన్ని పెద్దగా పరిగణనలోకి తీసుకోరు.

# స్టార్టప్ వెంచర్ కాపిటలిస్టులతో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి :** సింగపూర్ పర్యటనలో వున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్టార్టప్ వెంచర్ కాపిటలిస్టులతో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. సమావేశానికి సింగపూర్లోని భారత హైకమిషనర్ శిల్పక్ అంబులే, మంత్రి పి.నారాయణ, సింగపూర్ స్టార్టప్ వెంచర్ కాపిటలిస్టులు హాజరయ్యారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఇప్పుడు భారత్ నిద్రపోతున్న ప్రాంతం కాదు.. సంస్కరణలతో దూసుకుపోతున్న అతి పెద్ద ఆర్థికశక్తి. ప్రధాని మోదీ లాంటి ఆధునిక ఆలోచనలు ఉన్న వ్యక్తి దేశాన్ని ఓ అద్భుతమైన వేగంతో అభివృద్ధి చేస్తున్నారు. చైనా లాంటి దేశాలు ఆర్థిక అభివృద్ధి సాధించటానికి దశాబ్దాల కాలం పట్టింది. కానీ భారత్కు అంత సమయం పట్టటం లేదు. మెడికల్ టెక్నాలజీ సహా ఇతర ఆధునిక పరికరాల తయారీలో భారత్ అగ్రస్థానంలో ఉంది. ఎలక్ట్రానిక్స్ పరికరాలు ఇప్పుడు భారత్ నుంచి ఎగుమతి అవుతున్నాయి. 5వ జనరేషన్ యుద్ధ విమానాల తయారీ సహా ఇతర ఉత్పత్తులు వస్తున్నాయని అన్నారు. డెమోగ్రాఫిక్ డివిడెంట్తో అతిపెద్ద యువశక్తి కలిగిన మానవ వనరులను భారత్ కలిగి ఉంది. తయారీ రంగాన్ని ప్రోత్సహించేలా ఆంధ్రప్రదేశ్లో వేం వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ అనే విధానాన్ని అనుసరిస్తున్నాం. భూ సమీకరణ అనే కొత్త విధానం ద్వారా ప్రాజెక్టులకు భూములు ఇస్తున్నాం. అమరావతి రాజధాని ఈ ప్రాతిపదికనే నిర్మిస్తున్నాం. ఆమ్కా, గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ లాంటి పరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇచ్చి భూములు కేటాయించాం. వివిధ పారిశ్రామిక ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు ఇదే సరైన సమయం. పెట్టుబడిదారులు ముందుకు రావాలని పిలుపునిస్తున్నాను. శ్రీసిటీ లాంటి ప్రత్యేక పారిశ్రామిక వాడలు పెద్ద ఎత్తున పెట్టుబడుల్ని ఆకర్షిస్తున్నాయి. పౌర సేవలతో పాటు అన్ని అంశాలకూ టెక్నాలజీని అనుసంధానించాం. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా పెట్టుబడులకు ఆస్కారం ఉంది. వెంచర్ కాపిటలిస్టులు ఆ సంస్థ తయారు చేసిన స్టార్టప్లకు పెట్టుబడులు అందించే అవకాశం ఉంది. అత్యుత్తమ ఆవిష్కరణల్ని ప్రోత్సహించేందుకు వెంచర్ కాపిటలిస్టులు ముందుకు రావాలని కోరుతున్నానని అన్నారు.

Edited, Published and Owned by **Ramancharla Srikanth** & Printed by **V. Raj Kumar** at **RK PRINTERS**, # 1-7-210/2, Kamala Nagar, Opp ECIL Bus Stop, ECIL, Hyderabad, Telangana - 500062 & Published from Sri Lakshmi Narsimha Colony, Flat No.106. Balaji Nagar, Kapra, Medchal Dist., Telangana - 500087. **RNI No.: TELTEL/2023/90269**. Editor: **RAMANCHARLA SRIKANTH**, Mob: **9963708331**, Email: telanganashaan331@gmail.com